వైసీపీ బరితెగింపు



నానీపై హత్యాయత్నం సమాచారంతో మహిళా వర్శిటీ వద్దకు చేరుకున్న వందలాదిమంది టీడీపీ శ్రేణులు



మహిళా వర్శిటీ ఆవరణలో వైసీపీ కార్యకర్తల వీరవిహారం - సుత్తులు, బీర్ బాటిళ్లతో నానీ కారుపై దాడి-కారు దిగేసి వెళుతున్న నాని

- మహిళా వర్శిటీ ప్రాంగణంలో పులివర్తి నానీపై హత్యాయత్నం
- దాడులు, ప్రతిదాడులు... వాహనాల ధ్వంసం.. బైక్ దగ్ధం.. గాల్లోకి కాల్పులు... లాఠీఛార్జి... పలువురికి గాయాలు..
- స్ట్రాంగ్ రూములున్న వర్శిటీలో భద్రతా లోపం



మహిళా వర్శిటీ ఆవరణలో ధ్వంసమైన వైసీపీ వాహనం - వైసీపీ దాడుల్లో దెబ్బతిన్న నానీ కార్లు- గాయపడ్డ నానీకి ఉపచారాలు

తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి) : చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన దాడితో మంగళవారం తిరుపతి పద్మావతీ మహిళా విశ్వ విద్యాలయ ప్రాంగణం రణరంగంగా మారింది. దాడులు, ప్రతిదాడులు, వాహనాల ధ్వంసం, బైక్ దగ్ధం, గాల్లోకి కాల్పులు, లాఠీఛార్జీలు వంటి ఘటనలతో ప్రశాంతతకు మారుపేరైన మహిళా వర్శిటీ ప్రాంతం అట్టుడికిపోయింది. వందలాది మంది వైసీపీ, టీడీపీ మద్దతుదార్ల దాడులు, ప్రతిదాడులతో గంటల పాటు వర్శిటీ ప్రాంగణం, పరిసరాల్లో ఉద్రిక్తతలు రాజ్యమేలాయి.

మధ్యాహ్నం 3.22 గంటలకు

మహిళా విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూముల నుంచీ వెనుదిరిగి వస్తున్న పులివర్తి నానీ వాహనాలపై వైసీపీ వర్గీయులు బీరు బాటిళ్ళు, కర్రలు, ఇనుప రాడ్లు, సుత్తులతో దాడి చేశారు. వాహనాలు ధ్వంసం చేశారు. నానీని గాయపరిచారు. గన్‌మ్యాన్ గాల్లోకి కాల్పులు జరిపినా వెనక్కు తగ్గకుండా దాడులకు తెగబడడంతో గన్‌మ్యాన్ ధరణి కూడా తీవ్రంగా గాయపడ్డారు.

3.35 గంటలకు: దాడి నుంచీ తేరుకున్న నానీ అనుచరులు ఆయన్ను తీసుకుని వర్శిటీ మెయిన్ గేటు దాటి వెలుపలికి వచ్చి రోడ్డుపై బైఠాయించారు. అరగంట పాటు ధర్నా నిర్వహించి నానీని స్విమ్స్‌కు తరలించారు.

సాయంత్రం 4.10 గంటలకు: పెద్ద సంఖ్యలో మహిళా వర్శిటీలోకి చేరుకున్న టీడీపీ శ్రేణులు రాళ్ళు, ఇనుప రాడ్లతో ప్రతిదాడికి దిగారు. వైసీపీ వర్గీయులకు చెందిన కారును ధ్వంసం చేశారు. ఆవరణలో ఆందోళనకు దిగారు.

4.30గంటలకు: అలిపిరి సీఐ రామచంద్రా రెడ్డి వాహనంలో లోపలికి రాగా వాహనాన్ని చుట్టుముట్టి పోలీసు వైఫల్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఐ వాహనం దిగి దూరంగా వెళ్ళగా వాహనాన్ని ధ్వంసం చేశారు.

5గంటలకు: చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా భారీ సంఖ్యలో టీడీపీ మద్దతుదారులు వర్శిటీలోకి దూసుకొచ్చారు. పోలీసు తీరును నిరసిస్తూ వర్శిటీ ఎదుట ఆందోళనకు దిగారు.

5.15గంటలకు: ఇద్దరు ఏఎస్పీలు, డీఎస్పీలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. టీడీపీ వర్గీయుల ఆందోళన మరింత తీవ్రతరమైంది.

5.20గంటలకు: బీఎస్ఎఫ్ పోలీసులు రబ్బర్ బుల్లెట్లతో గాల్లోకి కాల్పులు జరిపారు. పోలీసులు లాఠీఛార్జి జరిపి చెదరగొట్టేందుకు యత్నించారు.

5.30 గంటలకు: వైసీపీ స్టిక్కర్ వున్న మొబైల్ చేతిలో పట్టుకుని బైక్‌పై వచ్చిన యువకుడిని ఆందోళనకారులు చితకబాది బైక్‌ను తగులబెట్టారు.

5.45 గంటలకు: మహిళా వర్శిటీ వద్దకు చేరుకున్న టియర్ గ్యాస్ వాహనాలు, కేంద్ర సాయుధ బలగాలు. వచ్చీ రాగానే లాఠీఛార్జి చేసి ఆందోళన కొనసాగిస్తున్న టీడీపీ వర్గీయులను చెదరగొట్టి తరిమివేశారు. లాఠీఛార్జిలో పది మంది గాయపడ్డారు. అందులో ఐదుగురు మీడియా ప్రతినిధులున్నారు.

6గంటలకు: ఘటనా స్థలానికి ఎస్పీ రాక. టీడీపీ అభ్యర్థి, అతడి గన్ మ్యాన్ క్షేమంగా వున్నారని, స్ట్రాంగ్ రూమ్ సైతం భద్రంగా వుందని మీడియాకు స్పష్టం చేశారు. అభ్యర్థిపై జరిగిన దాడిలో పాల్గొన్న నిందితులను గుర్తించామని, గంటలోగా అరెస్టు చేస్తామని వెల్లడించారు.

భీతావహంగా వర్శిటీ ప్రాంగణం

దట్టమైన అడవిని తలపించేలా పచ్చటి చెట్లతో, చల్లటి వాతావరణంతో ప్రశాంతతకు మారుపేరులా కనిపించే పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం ప్రాంగణం మంగళవారం చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన దాడితో ఉద్రిక్తతలకు నిలయంగా మారింది. దాడులు, ప్రతిదాడులు, అరుపులు, కేకలతో వర్శిటీ ఆవరణ, పరిసరాలు భీతావహంగా మారాయి. ఆవరణలో పగిలిన బీరు బాటిళ్ళు, రాళ్ళు విరిగిపోయిన కర్రలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడివున్నాయి. నానీ వాహనాలు, వైసీపీ వర్గీయుల వాహనం, పోలీసు వాహనం ధ్వంసమయ్యాయి. నానీ వాహనాల్లో ప్రత్యర్థులు దాడి సందర్భంగా వదిలిపెట్టిన రాళ్ళు, ఉనుప సుత్తి వంటివి పడివున్నాయి. వందలాది మంది టీడీపీ వర్గీయులు పోలీసు వైఫల్యాన్ని ప్రశ్నిస్తూ తీవ్ర ఆగ్రహావేశాలతో ఊగిపోతూ కనిపించారు. ఇక వర్శిటీ వెనుకవైపు తుమ్మలగుంటలోనూ వెయ్యిమందికి పైగా వైసీపీ వర్గీయులు రాళ్ళు, కర్రలతో మొహరించడం మరింత ఉద్రిక్తతకు కారణమైంది. ఆవరణ లోనూ, వెలుపలా మొహరించిన సివిల్ పోలీసులు, కేంద్ర బలగాలతో, లాఠీఛార్జీలతో మొత్తం మీద వర్శిటీ ప్రాంగణం, పరిసరాలు భీతావహంగా మారాయి.

పోలీసు వైఫల్యంతోనే టీడీపీ అభ్యర్థిపై దాడి

పులివర్తి నానీపై దాడి ఘటనలో పోలీసు వైఫల్యం స్పష్టంగా బయటపడింది. సోమవారం పోలింగ్ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణ కాలవ, పులివర్తివారిపల్లి, రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాలవలో బీఎస్ఎఫ్ జవాన్ గాల్లోకి కాల్పులు జరిపే దాకా పరిస్థితి విషమించింది. టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ స్వగ్రామమైన పాకాల మండలం పులివర్తివారిపల్లిలో వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌ను టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లిలో టీడీపీ వర్గీయులపై దాడులు జరిగాయి. పక్కనే వున్న కూచువారిపల్లికి వెళ్ళిన చెవిరెడ్డి మోహిత్, అతని సోదరుడు హర్షిత్‌రెడ్డి, అనుచరులను టీడీపీ వర్గీయులు నిర్బంధించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అతికష్టమ్మీద వారిద్దరినీ గ్రామం నుంచీ బయటకు పంపగలిగినా వారి అనుచరులు ఇద్దరు గ్రామంలోనే చిక్కుకుపోయారు.వారిని గ్రామస్తులు నిర్బంధించి దాడి చేసినట్టు వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. అలాగే మోహిత్ అనుచరులకు చెందిన రెండు కార్లను తగులబెట్టారు. వైసీపీ సర్పంచ్ ఇంటిని సైతం తగులబెట్టారు. చెవిరెడ్డి స్వగ్రామమైన తుమ్మలగుంటలో టీడీపీ నేత దొడ్ల కరుణాకర్‌రెడ్డిపై దాడికి యత్నం జరిగింది. ఈ ఘటనల నేపథ్యంలో నియోజకవర్గవ్యాప్తంగా టీడీపీ, వైసీపీ వర్గాల నడుమ ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. వీటి తీవ్రతను అంచనా వేయడంలో పోలీసులు దారుణంగా తప్పటడుగు వేశారు. వైసీపీ, టీడీపీ అభ్యర్థుల కదలికలను, ఎత్తుగడలను కూడా పోలీసు అధికారులు అంచనా వేయడంలో విఫలమయ్యారు. దాడులు, ప్రతిదాడులు జరిగే అవకాశముందన్న కనీస ఆలోచన గానీ, వాటిని అడ్డుకునే కనీస ప్రయత్నం గానీ చేయలేదు. అలాంటి ఆలోచన చేసివుంటే అభ్యర్థుల వెంట షాడో పార్టీలను నియమించి వుండేవారు. రెండు పార్టీల సామాజిక మాధ్యమాల మీద కన్నేసేవారు. వారి కదలికల సమాచారం షాడో పార్టీల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుని ఇలాంటి ఘటనలను నిలువరించే వీలుండేది. ఈ విషయంలో పోలీసులు దారుణంగా విఫలమైనట్టు కనిపిస్తోంది.

టీడీపీ శ్రేణులు వచ్చినంత వేగంగా పోలీసులు రాలేదు

మహిళా వర్శిటీ ఆవరణలో నానీపై దాడి జరగ్గా ఆయన సతీమణి సుధారెడ్డి సామాజిక మాధ్యమాల్లో అటు పోలీసులకు, ఇటు టీడీపీ శ్రేణులకు వెంటనే రావాలని పిలుపిచ్చారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎక్కడెక్కడో వున్న టీడీపీ కార్యకర్తలు వందలమంది అరగంటలో మహిళా వర్శిటీకి చేరుకోగా పోలీసు బలగాలు మాత్రం సకాలంలో రాలేదు. దానివల్లే ఐదారు వందల మంది టీడీపీ మద్దతుదారులు వర్శిటీ ఆవరణలోకి ప్రవేశించి ప్రతి దాడులకు పాల్పడ్డారు. చివరికి పోలీసు వాహనం కూడా వారి దాడిలో ధ్వంసమైంది. దీనికి కూడా పోలీసు వైఫల్యమే కారణంగా కనిపిస్తోంది.



వైసీపీ దాడుల్లో గాయపడ్డ గన్‌మ్యాన్ ధరణి

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత డొల్లతనం బట్టబయలు

మహిళా వర్శిటీ ఆవరణలోని ఇంజనీరింగ్ విభాగం గదుల్లో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ మూడంచెల భద్రత కల్పించామని కలెక్టర్, ఎస్పీ స్వయంగా వెల్లడించారు. తొలి అంచెలో అంటే గదుల వద్ద సీఐఎస్ఎఫ్ బలగాలు, రెండవ అంచెలో అంటే భవనం వెలుపల సాయుధ బలగాలు, మూడవ అంచెలో సాధారణ పోలీసులు, హోమ్‌గార్డులు కాపలా వుంటారని చెప్పారు. ఎన్నికల అధికారులను, అభ్యర్థులను, వారి జనరల్ ఏజెంట్లను అది కూడా వారి ఐడీలను తనిఖీ చేశాకే లోనికి అనుమతించాల్సి వుండగా 150మందికి పైగా వైసీపీ కార్యకర్తలు వాహనాల్లో వర్శిటీ ఆవరణలోకి ఎలా రాగలిగారన్నది ప్రశ్న. అంతమంది యథేచ్ఛగా మారణాయుధాలతో లోనికి వచ్చి టీడీపీ అభ్యర్థి వాహనాలను ధ్వంసం చేసి అభ్యర్థిపైన, గన్‌మ్యాన్‌పైనా దాడి చేయడం కలకలం సృష్టించింది. ఇదే సాధ్యమైనప్పుడు స్ట్రాంగ్ రూముల్లోని ఈవీఎంలను పోలీసు యంత్రాంగం ఎంతవరకూ కాపాడగలదన్న ప్రశ్న తలెత్తుతోంది. మొత్తానికి స్ట్రాంగ్ రూములున్న వర్శిటీ ఆవరణలో భద్రత డొల్లతనాన్ని ఈ ఘటన బట్టబయలు చేసింది.

స్ట్రాంగ్ రూమ్ కాపలా పోలీసులు అడ్డుకోకుంటే నానీ పరిస్థితి ఏమయ్యేది?

మహిళా వర్శిటీ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద కాపలా వున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో నానీపై దాడికి పాల్పడిన వైసీపీ వర్గీయులు పరారయ్యారు. ఒకవేళ కాపలా పోలీసులు అక్కడికి సకాలంలో రాకపోయివుంటే నానీ, అతడి అనుచరుల పరిస్థితి ఏమై వుండేదన్న ప్రశ్న భయం గొలుపుతోంది. వైసీపీ వర్గీయులు రాళ్ళు, కర్రలు, ఇనుప రాడ్లు, సుత్తులు వంటివి వెంట తెచ్చుకుని వాటితోనే దాడికి దిగిన తీరు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. దాడిలో నానీకి జరగరానిది ఏదైనా జరిగివుంటే చంద్రగిరి, తిరుపతి, చిత్తూరు నియోజకవర్గాల్లో టీడీపీ శ్రేణులు మరింత రెచ్చిపోయి ప్రతీకార దాడులకు దిగివుండేవారు. అదే జరిగితే పరిణామాలు తీవ్రంగా వుండేవి.

నానీని చూడ్డానికి వెళ్తుండగా దాడి చేశారు

పాకాల, మే 14 :తిరుపతిలో పులివర్తి నానీపై దాడి జరిగిందని తెలిసి చూడ్డానికి వెళుతున్న తెలుగుదేశం మద్దతుదారులపై మంగళవారం సాయంత్రం పాకాల సమీపంలో వైసీపీకి చెందిన కొందరు దాడి చేశారు. బాధితుల కథనం మేరకు... ఐరాల మండలం పేరయ్యగారిపల్లెకు చెందిన తనూజ్, జ్యోతిష్, సోమశేఖర్, రాజశేఖర్, సాయిభరత్ కారులో తిరుపతికి వెళ్తుండగా పాలినేనిపల్లె సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జివద్ద వైసీపీకి చెందిన హరీష్, సద్దాం, నూర్‌నబీ, అబ్దుల్, కున్ని దాడిచేశారు. కారు అద్దాలు పగులగొట్టారు. బాధితుల ఫిర్యాదుతో ు పాకాల పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నానీపై దాడికి నిరసనగా వైసీపీకి రాజీనామా

చంద్రగిరి, మే 14 : నానీపై వైసీపీ దాడిని నిరసిస్తూ వైసీపీ స్టేట్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దామరపాటి గుణశేఖర్‌నాయుడు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడ్డానని, అయితే ఇటీవల జరుగుతున్న అరాచకాలు, దౌర్జన్యాలను చూశాక పార్టీలో వుండలేక పోతున్నానన్నారు.నానీపై వైసీపీ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.



టీడీపీ కార్యకర్తలపై లాఠీచార్జి

నాని, గన్‌మెన్ ధరణి క్షేమం

- వారిపై దాడులకు తెగబడిన వారిని తక్షణం అరెస్టు చేస్తాం
- ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి(నేరవిభాగం), మే 14:పులివర్తి నానీపై మహిళా వర్శిటీ వద్ద దాడికి పాల్పడిన ఘటనలో అందరినీ గుర్తించి అరెస్టు చేస్తామని ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ చెప్పారు.మహిళా విశ్వవిద్యాలయం వద్ద దాడి జరిగిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించి పోలీసులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న నానీని పరామర్శించారు. రుయాలో చికిత్స పొందుతున్న గన్‌మ్యాన్ ధరణిని పరామర్శించారు.జరిగిన ఘటనపై ఇద్దరి వద్దా స్టేట్ మెంట్లు రికార్డు చేశారు. రాడ్లు,సుత్తులు, కర్రలు, బీరు బాటిళ్ళు, రాళ్ళతో జరిపిన దాడుల్లో నాని భుజానికి బలమైన గాయమైంది. అలాగే గన్‌మెన్‌కు కుడి కంటిపై గాయం కావడంతో చికిత్స నిమిత్తం రుయాలో చేరారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ నాని, ఆయన గన్‌మెన్ క్షేమంగా వున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని వీలైనంత త్వరలో పట్టుకుంటామన్నారు.

దాడి కేసులో ప్రధాన నిందితులు గణపతి,భాను ?

పులివర్తి నానీ, ఆయన గన్‌మెన్ ధరణిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి సీసీ పుటేజీ, అక్కడున్న కారు ఎవరిది అనే వివరాలను పోలీసులు సేకరించినట్లు తెలిసింది.రామచంద్రాపురం జడ్పీటీసీ డిల్లీరాణి భర్త భానుకుమార్ రెడ్డి, నడవలూరు సర్పంచ్ గణపతి రెడ్డితో పాటు దాదాపు 50మంది దాకా దాడి ఘటనలో పాల్గొన్నట్లు సీఐ మురళీకృష్ణ గుర్తించారు. ఘటనా స్థలంలో వైసీపీ కండువాలను, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులను పట్టుకోవడానికి ఎస్పీ ప్రత్యేక బృందాలను నియమించారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

● 22 నుంచి అమ్మవారి వసంతోత్సవాలు


ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ అధికారులు

తిరుచానూరు, మే 14: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళ వారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం నిర్వహించారు. ఆ తర్వాత భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.


ఆలయానికి దాత అందజేసిన పరదాలు

అమ్మవారి ఆలయంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు మూడురోజుల పాటు వార్షిక వసంతోత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం 21వ తేదీ సాయంత్రం 6గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. భక్తులు ఒక్కొక్కరు రూ.150 చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. ఉత్సవాల్లో భాగంగా మే 23వ తేదీ ఉదయం 7.45గంటలకు స్వర్ణరథోత్సవం జరుగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాస్కర్ నాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు. వసంతోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి ఓ దాత పరదాలు కానుకగా అందజేశారు.

తుమ్మలగుంటలో వైసీపీ నేతల పహారా

తిరుపతి రూరల్, మే 14: తిరుపతిలోని పద్మావతి వర్శిటీలో టీడీపీ, వైసీపీ శ్రేణుల వర్గీయుల నడుమ దాడి జరిగిన నేపథ్యంలో సమీపంలో వున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి స్వగ్రామమైన తుమ్మలగుంట గ్రామం మంగళవారం సాయంత్రం వైసీపీ శ్రేణులతో కిక్కిరిసింది. నియోజకవర్గంలో పలు పంచాయతీలకు చెందిన వైసీపీ నేతలు, యువత ఎమ్మెల్యే ఇంటికి చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గ్రామ ముఖద్వారమైన తెలుగుతల్లి విగ్రహం నుంచి పురవీధులు వైసీపీ నాయకులతో కిక్కిరిశాయి. ఎమ్మెల్యే కుటుంబసభ్యులకు రక్షణగా పలువురు యువకులు కర్రలను చేతబట్టి గ్రామంలో హల్‌చల్ చేస్తూ కనిపించారు. కాగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తెలుగుతల్లి విగ్రహం వద్ద ముందస్తుగా పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి ఒంగోలు నుంచి వస్తున్నారన్న సమాచారంతో పెద్దసంఖ్యలో నాయకులు అక్కడికి చేరుకున్నట్లు తెలిసింది. మొత్తంమీద గ్రామంలో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళనలో ఉన్నారు.

మీడియా ప్రతినిధులపై లాఠీచార్జి అమానుషం

- ఏపీయూడబ్ల్యూజే

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 14: టీడీపీ, వైసీపీ వర్గాలమధ్య జరుగుతున్న దాడిని కవర్‌చేస్తున్న మీడియా ప్రతినిధులపై పోలీసులు లాఠీచార్జి చేయడం దారుణమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, నరేంద్ర ఖండించారు. ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులను కవర్‌చేస్తున్న ఫొటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టులు, పాత్రికేయులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేయడం దారుణమని వారు పేర్కొన్నారు. మహిళా వర్శిటీ వద్దకు ఇరు వర్గాలు చేరుకున్నప్పటికీ తగు జాగ్రత్తలు తీసుకోవడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పోలీసుల దాడుల్లో పదిమంది జర్నలిస్టులు గాయాలపాలయ్యారని, విధినిర్వహణలో ఉన్న మీడియా సిబ్బందిపై దాడిచేసిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పులివర్తి నానీపై వైసీపీ శ్రేణుల దాడి, జర్నలిస్టులపై పోలీసుల దాడి రెండూకూడా పోలీసుల వైఫల్యమేనని పత్రికా సంపాదకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా లక్ష్మీపతి ఖండించారు. ఇకనైనా పోలీసులు జర్నలిస్టులకు విధినిర్వహణలో సహకరించి భద్రత కల్పించాలని కోరారు.

నానీపై దాడిని ఖండిస్తున్నాం : సీపీఐ

తిరుపతి(నేర విభాగం), మే 14: చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై, ఆయన గన్‌మెన్‌పై వైసీపీ శ్రేణులు విచక్షణారహితంగా దాడి చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలు పూర్తయి 24 గంటలు గడవక ముందే వైసీపీ వర్గీయులు ప్రత్యర్థులపై దాడులకు తెగబడటం శోచనీయమన్నారు. ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూము పరిశీలనకు వెళ్లి తిరిగి వస్తున్న నానీపై రాళ్లు, మారణాయుధాలతో విచక్షణారహితంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసు అధికారులకు రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. జూన్ 4న ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల కమిషన్, పోలీసు యంత్రాంగం సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూములకు తగిన భద్రత కల్పించాలని, అరాచక శక్తులను ముందస్తు అరెస్టులు చేయాలని ఆయన కోరారు.

ఓటమి భయంతోనే నానీపై దాడి : సుధాయాదవ్



తిరుపతి రూరల్, మే 14: ఓటమి భయంతోనే పులివర్తి నానీపై దాడిచేశారని ఓబీసీఫోరం రాష్ట్ర కన్వీనర్, టీడీపీ నేత బడి సుధాయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పద్మావతి మహిళా వర్శిటీలో స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలనకు ఒంటరిగా వెళ్లిన నానీపై వైసీపీ శ్రేణులు దారికాచి కర్రలు, రాళ్లు, బీరుబాటిళ్లు, ఆయుధాలతో దాడి చేయడం పిరికిపంద చర్య అని ఖండించారు. గన్‌మెన్ చాకచక్యంగా వ్యవహరించి నానీని కాపాడారని, భగవంతుడి దయతో ఆయన స్వల్పగాయాలతో బయటపడ్డారని తెలిపారు.

నానీపై దాడికిపాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి (జీవకోన), మే 14: మహిళా యూనివర్శిటీలో స్ట్రాంగ్‌రూములను పరిశీలించేందుకు వెళ్లిన పులివర్తి నానీపై వైసీపీ శ్రేణులు దాడి చేసిన ఘటనపై పోలీసులు విచారించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు, టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

జిల్లా కేంద్రానికి చేరుకున్న ఈవీఎంలు

తిరుపతి(కలెక్టరేట్), మే 14: సార్వత్రిక ఎన్నికల తుది సమరం ముగియడంతో మంగళవారం రాత్రికి ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. ఎన్నికల అబ్జర్వర్లు ఉజ్వల్‌కుమార్ ఘోష్, కైలాస్ వాంఖేడ్, కె.జ్యోతి, అరవింద్‌సాల్వే, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీ, అభ్యర్థుల సమక్షంలో ఈవీఎంలు భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూమ్‌కు సీల్ వేశారు. పోటీచేసిన అభ్యర్థులు, ఏజెంట్లు ఎలాంటి అనుమానాలున్నా వర్సిటీలో ఏర్పాటు చేసిన సీసీటీవీల దృశ్యాలను పరిశీలించుకోవచ్చని అధికారులు తెలిపారు. డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించడానికి వచ్చిన పులివర్తి నానిపై వైసీపీ నేతలు దాడికి పాల్పడటంతో తీవ్ర కలకలం రేగింది. ఈ నేపథ్యంలో వర్సిటీ పరిసరాలను కేంద్ర సాయుధబలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. పరిసరాల్లోని రోడ్లపై రాకపోకలను నిషేధించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.


కలెక్టర్ ఆధ్వర్యంలో స్ట్రాంగ్‌రూమ్‌కు వేస్తున్న సీల్

పాకాల పరిసర గ్రామాలు గజగజ

పాకాల, మే 14: మండలంలోని పాకాల పరిసర గ్రామాల్లో ఒంటరి ఏనుగు సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సోమవారం మణిపిరెడ్డిపల్లె సమీపంలో రాళ్లు కొడుతున్న కార్తీకరాయన్‌ను తొండంతో కొట్టి తొక్కి చంపేసిన అనంతరం అడుసుపల్లె, కుందేటివారిపల్లె పరిసరాల్లో సంచరించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. రాత్రంతా గ్రామస్తులు కంటిమీద కునుకు లేకుండా గడిపారు. మంగళవారం ఉదయం బత్తినవారిపల్లె అటవీ ప్రాంతానికి వెళ్లినట్లు తెలిసింది, మళ్లీ రాత్రి పంటపల్లె, తలారిపల్లె పరిసరాలకు రావడంతో గ్రామస్తులు భయపడి ఇళ్లలో లైట్లు ఆర్పివేసి టపాకాయలు పేల్చారు. పాకాలకు అతి సమీపంలో ఒంటరి ఏనుగు తిరుగుతోందని, మనుష్యులపై దాడి చేస్తోందని తెలిసి ప్రజలు భయాదోంళన చెందుతున్నారు. ఏనుగు కదలికలను డ్రోన్ కెమెరా సాయంతో గాలిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఏనుగు బారినుంచి రక్షించాలని అటవీ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

నేడు సంస్కార శిబిరం ముగింపు సభ

తిరుపతి(కల్చరల్), మే 14: రామకృష్ణా ఆశ్రమం ఆవరణలో రెండు వారాలుగా బాల బాలికలకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ బుధవారం ఉదయం 9.30 గంటలకు జరగనుంది. ఈ మేరకు ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారులకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. అలాగే తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

చిల్లీస్ వితరణ

తిరుపతి అర్బన్, మే 14: చిల్లీస్ హోటల్ అండ్ రెస్టారెంట్ 15వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం జన్మించిన వారికి యజమాని అంజి బిర్యానీ ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ విషయం తెలిసి వచ్చినవారు తమ జనన ధ్రువీకరణ పత్రాలను చూపించి బిర్యానీ ప్యాకెట్లు అందుకున్నారు.

వైసీపీ నేత వెలి

● కూచివారిపల్లె గ్రామస్తుల నిర్ణయం

● అధికార పార్టీ దాడిలో గాయపడిన గ్రామస్తులకు సుధారెడ్డి పరామర్శ


గ్రామస్తులకు అండగా ఉంటామని భరోసా ఇస్తున్న పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, మే 14: మండలంలోని కూచివారిపల్లెలో గ్రామస్తులపై దాడికి పాల్పడిన వైసీపీ నేత కొటాల చంద్రశేఖర్‌రెడ్డిని గ్రామం నుంచి వెలి వేయాలని గ్రామస్తులు నిర్ణయించారు. సోమవారం రాత్రి మండలంలోని రామిరెడ్డిపల్లి పంచాయతీ, కూచువారిపల్లెలో వైసీపీ నేత కొటాల చంద్రశేఖర్‌రెడ్డి సుమారు వందమంది అనుచరులను తీసుకువచ్చి గ్రామస్తులపై దాడికి పాల్పడటంతో 8 మందికి తీవ్ర రక్త గాయాలు కావడం... టీడీపీ వర్గీయులు కూడా ప్రతిదాడికి పాల్పడిన విషయం విదితమే. మంగళవారం కూచువారిపల్లె గ్రామస్తులు భజన దేవాలయంలో సమావేశమై.. గ్రామస్తులపై దాడి చేయించిన చంద్రశేఖర్‌రెడ్డిని గ్రామం నుంచి వెలేయాలని నిర్ణయం తీసుకున్నారు. అనంతరం టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి గ్రామస్తులను, దాడిలో గాయపడిన వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కేవలం ఈ గ్రామం టీడీపీకి అనుకూలంగా ఉందనే కారణంచేత తన ఇరుగు పొరుగు వారిపై చంద్రశేఖర్‌రెడ్డి పక్క గ్రామస్తులను తీసుకొచ్చి రాడ్లు, కర్రలు, రాళ్లతో దాడి చేయించాడని ఆరోపించారు. వైసీపీ వారే వాళ్ల ఇంటిని, కారును తగలబెట్టుకొని, పబ్లిసిటీ ఇచ్చుకున్నారని విమర్శించారు. గ్రామం నుంచి వెలి వేయాలని నిర్ణయం తీసుకున్నారంటే చంద్రశేఖర్‌రెడ్డి సిగ్గుపడాలన్నారు. ఈ గ్రామానికి శాశ్వత పరిష్కారం కావాలని డిమాండ్ చేశారు. అధికారులు, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు... చంద్రశేఖర్‌రెడ్డిని గ్రామం నుంచి వెలి వేయాలని, లేదంటే మేమే పరిష్కారం చూపుతామని ఆమె హెచ్చరించారు.

నా కుమారుడిని కొడతా ఉంటే అడ్డమొచ్చిందానికి నన్నూ కొట్టారు



నా కుమారుడు మోహన్‌ను కొంత మంది కొడతా ఉంటే నేను నా కొడుకుని ఎందుకు కొడుతున్నారని అడ్డమొచ్చిందానికి నన్ను, నా కొడుకునూ కర్రలతో కొట్టారు. తలకు తీవ్ర రక్త గాయమైంది. కుట్లు వేశారు. మాటూరోడు ఇంత పని చేస్తాడని అనుకోలేదు.

- వనజ

ఉన్నట్లుండి వందమంది కర్రలు, రాడ్లతో వచ్చారు



ఊర్లోకి ఉన్నట్లుండి వందమంది కర్రలు, రాడ్లు, రాళ్లతో వచ్చి మాపై దాడి చేశారు. అసలు ఎందుకు మమ్మల్ని కొడుతున్నారో మాకే తెలియలేదు. అడగటానికి కూడా టైమ్ ఇవ్వకుండా కర్రలతో తలపై కొట్టారు. చిన్నపిల్లలు ఉన్నారని కూడా చూడలేదు. అందర్నీ కొట్టారు.

- మోహన్

చల్లటి గాలి కోసం వీధిలోకి వచ్చాను.. నన్నూ కొట్టారు.



వేసవి కాలం కావడంతో చల్లటి గాలి కోసం వీధిలోకి వచ్చాను. గుంపులు, గుంపులుగా వచ్చి కూర్చొని ఉన్న నన్నూ కొట్టారు. అసలు ఎందుకు కొడుతున్నారో, ఎవరు కొడుతున్నారో అర్థంకాలేదు. మా పక్కంటి వ్యక్తి కొటాల చంద్రా మమ్మల్ని కొట్టిస్తారని అనుకోలేదు.

- ఆదికేశవులు నాయుడు

వైసీపీ నేతను వెలేయాలని నిర్ణయించాం



వైసీపీ నేత కొటాల చంద్రశేఖర్‌రెడ్డి తరచూ మా గ్రామంలో గొడవలు చేస్తుంటాడు. మా గ్రామమంతా ఒక్కటే.. ఇతను మాత్రమే మాకు వ్యతిరేకంగా ఉంటాడు. మా గ్రామస్తులపైన దాడి చేసి, మారణాయుధాలతో మమ్మల్ని చంపడానికి వచ్చిన వ్యక్తి.. ఇక మాగ్రామంలో అవసరంలేదని గ్రామస్తులు తీర్మాణించాము.

- మురళీధర్

ఆయన వల్ల మా గ్రామానికి చెడ్డపేరు



వైసీపీ నేత వలన మా గ్రామానికే చెడ్డపేరు వస్తుంది. ఇతర గ్రామాల్లో ఉన్న ఆకతాయిలను తరచూ గ్రామంలోకి తీసుకొచ్చి, గొడవలు చేస్తుంటాడు. మా గ్రామంలో ఉద్యోగస్తులు, మహిళలు, చిన్నపిల్లలు ఉన్నారు. ఇతడి వలన గ్రామంలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

- మోహన్


స్విమ్స్ వద్దకు నానీని చూడ్డానికి చేరుకున్న టీడీపీ శ్రేణులు

స్విమ్స్‌లో నానీకి చికిత్స

● గన్‌మ్యాన్,మరో 14మంది టీడీపీ కార్యకర్తలకు కూడా

తిరుపతి(వైద్యం), మే 14 : వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీతోపాటు మరో 14 మంది కార్యకర్తలను చికిత్స నిమిత్తం స్విమ్స్‌కు మంగళవారం సాయంత్రం తీసుకొచ్చారు.అత్యవసర విభాగంలోని ఆర్‌ఐసీయూలో చికిత్స పొందుతున్న నానీని చూసేందుకు టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీగా వచ్చారు. దీంతో స్విమ్స్ ఆవరణ మొత్తం టీడీపీ కార్యకర్తలతో నిండిపోయింది. ఈ సందర్భంగా పలువురు టీడీపీ, జనసేన నేతలు నానీని పరామర్శించారు. వీరిలో తిరుపతి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రౌడీయిజానికి ఇది పరాకాష్ట అన్నారు.ఎన్నికల్లో ఓటమి తేలిపోవడంతో తట్టుకోలేక ఇలా రౌడీ మూకలను దాడులకు ఉసిగొలుపుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చాక వైసీపీ నేతలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.




నానీ కారులో వైసీపీ శ్రేణులు విసిరిన రాయి, నానిపై విసిరిన బీర్ బాటిల్

లాఠీచార్జిలో 12 మందికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), మే 14 : మహిళావర్శిటీలో నానీపై వైసీపీ శ్రేణులు దాడి చేసినప్పుడు ఆయన గన్‌మ్యాన్ ధరణికి కూడా కంటిపై గాయాలయ్యాయి.దాడి సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు వర్శిటీ వద్దకు భారీగా చేరుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పరిస్థితి చేయి దాటిపోతోందని గుర్తించిన ఏఎస్పీలు కులశేఖర్, రాజేంద్ర కేంద్ర బలగాలను రప్పించారు. వారు పరిసితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు లాఠీ చార్జి చేశారు.12 మంది టీడీపీ కార్యకర్తలు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనను చిత్రీకరిస్తున్న కొంతమంది మీడియా సిబ్బంది, వీడియోగ్రాఫర్లపై కూడా కేంద్ర బలగాలు లాఠీలకు పనిచెప్పాయి. ఈ ఘటనలో మీడియా సిబ్బంది శివరాజన్, రాధాకృష్ణ, వినోద్, శేఖర్, నరేంద్రలకు కూడా కాళ్ళు చేతులపై స్వల్ప గాయాలయ్యాయి.ఈ సందర్భంగా సీఐ రామచంద్రారెడ్డి తీరుకు నిరసనగా ఆందోళనకు దిగారు. ఎస్పీ దృష్టికి మీడియా సిబ్బంది ఈ విషయాన్ని తీసుకెళ్ళగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



టీడీపీకి ఓట్లు వేస్తారా అంటూ గర్భిణిపై దాడి


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

పెళ్లకూరు, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తారా అంటూ ఓ గర్భిణిపై మాజీ వలంటీర్ మాలతి సోదరుడు తేజ దాడి చేశాడు. ఈ ఘటన మం గళవారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు..తమిళనాడుకు చెందిన వి.కృష్ణన్ కుటుంబం సహా మరికొన్ని పెళ్లకూరు మిట్టలో నివాసం ఉంటున్నాయి. కృష్ణన్ మనవరాలు వి.అరుణకు ఇక్కడ ఓటు ఉంది. ఈ క్రమంలో సోమవారం ఓటు వేసింది. సోమవారం సాయంత్రం మాజీ వలంటీర్ పెద్దనాన్న కృష్ణయ్య... కృష్ణన్ ఇంటికి వచ్చి టీడీపీకి ఓటు వేశారా ప్ర శ్నించారు. తాము ఎవ్వరికి ఓటేశామో ఎందుకు చెప్పాలని ప్రశ్నించడంతో ఆయనపై దాడికి యత్నించారు. అక్కడే ఉన్న అరుణ అడ్డుకోవడంతో మాజీ వలంటీర్ సోదరుడు తేజ ఆమెను కాలితో తన్నాడు. దీంతో ఆమెను కుటుం బీకులు శ్రీకాళహస్తికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్సల అనంతరం తిరుపతి మెటర్నటీ ఆసుపత్రికి తరలించారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ వర్గీయుల కత్తితో దాడి


మెడ కింద కట్టుతో గోపి

నాయుడుపేట టౌన్, మే 14: టీడీపీ కార్యకర్త నెలవల గోపిపై వైసీపీ వర్గీయులు కత్తితో దాడి చేశారు. నాయుడుపేట మండలం మాబాకలో ఈ సంఘటన జరిగింది. బాధితుడి కథనం మేర కు... ఎన్నికల సంద ర్భంగా నెలవల గోపి టీడీపీ తరపున ఆటోలో నియోజకవర్గంలో ప్రచారం చేపట్టాడు. సోమవారం ప్రయాణికులను ఎక్కించుకొని ద్వారకాపురానికి వెళ్లాడు. అదే సమయంలో వైసీపీ వర్గీ యులకు గోపి మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో మంగళవారం గోపి ప్రయాణికులతో మాబాక గ్రామానికి వెళ్లాడు. అక్కడే ఉన్న వైసీపీ వర్గీయులు ప్రతాప్, రంగయ్య, మణి ద్వారకాపురంలో జరిగిన సంఘటనను మనస్సులోపెట్టుకుని మాబాకకు ఎందుకొచ్చావని అడి గారు. దీంతో వారి మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. ఉన్న ట్టుండి ప్రతాప్, రంగయ్య, మణి కత్తితో గోపీ గొంతుపై తీవ్రంగా గాయపరిచారు. అక్కడే ఉన్న స్థానికులు అడ్డుకుని గాయపడ్డ గోపిని నాయుడుపేట ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో గోపి ఫిర్యాదు చేశాడు.

టీడీపీ నాయకుడిపై దాడి


చికిత్స పొందుతున్న గోపాల్

చిల్లకూరు, మే 14: మండలంలోని చింతవరంకొత్తపాళేనికి చెందిన గోపాల్ అనే వ్యక్తిపై మంగళవారం వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. స్థానికుల కథనం మేరకు... చితవరంకొత్త పాళేనికి చెందిన గోపాల్ టీడీపీ నాయకుడు. చింతవరంలో ఎరువుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ ఎన్నికల్లో టీడీపీ తరపున ఆ గ్రామంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. దీంతో మంగళవారం గోపాల్ దుకాణంలో ఉండగా బైక్‌లపై వచ్చిన వైసీపీ నాయకులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ గోపాల్‌ను చిల్లకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం నెల్లూరులోని ఓప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు క్రాంతి, దిలీప్, చెంచయ్యిఐ పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రొయ్యలగుంటలో విషం చల్లారు

చిల్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి రొయ్యలగుంటలో గుర్తుతెలియని వ్యక్తులు విషం కలపడంతో నష్టం వాటిల్లింది. ఈ ఎన్నికల్లో టీడీపీ పక్షాన ప్రచారం నిర్వహించడంతో వైసీపీ నాయకులు తిప్పగుంటపాళెంలోని ఆయన రొయ్యలగుంటల్లో సోమవారం విషం కలిపారు. మంగళవారం రొయ్యలను పట్టాల్సి ఉండగా సోమవారం విషం చల్లడంతో రొయ్యలన్నీ చనిపోయాయి. దీంతో రూ. 15లక్షల వరకు నష్టం వాటిల్లిందని వెంకటేశ్వర్లు రెడ్డి చెప్పారు.

సుబ్బయ్యకండ్రిగలో టీడీపీ నేతలపై దాడి

రేణిగుంట, మే 14: రేణిగుంట మండలం ఆర్.మల్లవరం పంచాయతీ పరిధిలోని సుబ్బయ్యకండ్రిగలో టీడీపీ నాయకులపై వైసీపీ వర్గీయులు సోమవారం రాత్రి దాడి చేశారు. స్థానికుల కథనం మేరకు... సుబ్బయ్యకండ్రిగలోని పోలింగ్‌బూత్‌లో టీడీపీ తరపున ఏజెంట్‌గా ఉన్న గుండ్రాల రెడ్డి ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉండగా స్థానిక సర్పంచు బాబ్జిరెడ్డి, అతని అనుచరులకు వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో గుండ్రాల రెడ్డిపై వైసీపీ వర్గీయులు దాడి చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత చిన్నారెడ్డి సంఘటనాస్థలానికి చేరుకుని దాడిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సంర్భంగా చిన్నారెడ్డి తలకు రక్తగాయాలయ్యాయి. వైసీపీ మండల నాయకులు సుబ్బయ్యకండ్రిగకు చేరుకోవడంతో గ్రామంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గ్రామస్తులు వైసీపీ నాయకులను చుట్టుముట్టారు. అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వైసీపీ నాయకులను అక్కడి నుంచి పంపించేశారు.టీడీపీ నాయకులపై వైసీపీ నేతలు దాడి చేయడాన్ని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

నాగలాపురం, మే 14: నాగలాపురం మండలం కడివేడు గ్రామానికి చెందిన చెంచురామయ్య(70) వడదెబ్బతో మృతి చెందాడు. ఎస్‌ఐ ఓబయ్య కథనం మేరకు.. గ్రామానికి వెళ్లే బండిబాట వద్ద సోమవారం సాయంత్రం చెంచురామయ్య మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ ఓబయ్య సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించి, పోస్టుమార్టం చేయించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.చెంచు రామయ్య ఆదివారం నుంచి కనిపించంలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచిన ఈవీఎంలు

పోలింగ్ శాతం 78.63

● సత్యవేడులో అత్యధికంగా 85.28, తిరుపతిలో అత్యల్పంగా 63.32 నమోదు

● ఓటు హక్కు వినియోగంలో పురుషులదే పైచేయి

తిరుపతి(కలెక్టరేట్), మే 14: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. దీనివల్ల ఓటింగ్ శాతం పూర్తిగా లెక్కించడానికి మంగళవారం వరకు అధికారులకు సమయం పట్టింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 78.63 శాతం పోలింగ్ జరిగింది. 18,12,980 మంది ఓట్లకుగాను 14,25,540 పోలయ్యాయి. ఇందులో పురుషులు 6,99,687మంది, మహిళలు 7,25,790మంది, ఇతరులు 63మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ దఫా ఓటు హక్కు వినియోగంలో పురుషులు పైచేయి సాధించారు. 79.21శాతం పురుషులుండగా, మహిళలు 78.09 శాతానికి పరిమితమయ్యారు. సత్యవేడులో అత్యధికంగా 85.28శాతం ఓట్లు పోలవగా, తిరుపతిలో అత్యల్పంగా 63.32శాతం నమోదైంది.

తిరుపతి పార్లమెంటు పరిధిలో 79.10శాతం నమోదు

నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతమిలా..

గూడూరు	- 78.89
సూళ్లూరుపేట	- 82.92
వెంకటగిరి	- 80.87
చంద్రగిరి	- 79.89
తిరుపతి	- 63.32
శ్రీకాళహస్తి	- 83.25
సత్యవేడు	- 85.28

తిరుపతి పార్లమెంటుకు వచ్చేసరికి పోలింగ్ శాతం 79.10గా నమోదైంది. 17,29,832 మంది ఓటర్లుండగా 13,68,362 ఓట్లు పోలయ్యాయి. 6,94,837 మంది మహిళలు, పురుషులు 6,73,487మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మాత్రం మహిళలే ఎక్కువగా ఓటుహక్కు వినియోగించుకున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.16 కోట్లు

తిరుమల, మే 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.16 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 70,815 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 25,245 మంది తలనీలాలు సమర్పించారు.

గోవిందుడి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

తిరుపతి(కల్చరల్), మే 14: గోవిందరాజ స్వామి ఆలయంలో గురువారం నుంచి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయంలో బుధవారం అంకురార్పణ జరుగుతుంది. ఇందులో భాగంగా సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. గురువారం ఉదయం 8.15 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి.

తిరుమలేశుడి సేవలో ఐపీఎల్ క్రికెటర్లు


బెంగళూరు టీమ్ క్రికెటర్లు

తిరుమల, మే 14 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ బెంగళూరు టీమ్ క్రికెటర్లు అనూజ్ రేవంత్, కరణ్ శర్మ, స్వప్నిల్ సింగ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వారు ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపలకు వచ్చిన క్రికెటర్లను చూసేందుకు క్రికెట్ అభిమానులు ఉత్సాహం చూపారు.

ఏపీఆర్జేసీ ఫలితాల్లో 'విశ్వం' ప్రతిభ


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), మే 14: ఏపీఆర్జేసీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చూపారని అధినేత డాక్టర్ విశ్వనాథరెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతోపాటు వివిధ విభాగాల్లో 10లోపు తొమ్మిది ర్యాంకులు సాధించారని వివరించారు. పి.హేమశ్రీ, కె.నిత్యశ్రీ కళ్యాణి ప్రథమ ర్యాంకు సాధించగా, ఒ.ధీరజ్ ద్వితీయ ర్యాంకు, పి.మేఘన, ఆర్.మహిత తృతీయ ర్యాంకు సాధించారన్నారు. అలాగే కె.చరిత 4వ ర్యాంకు, ఆర్.రెడ్డిచరణ్‌రెడ్డి ఐదు, సి.లేఖన ఆరు, డి.నవదీప్‌నాయక్ ఏడో ర్యాంకులు సాధించారని తెలియజేశారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ తులసితోకలిసి విశ్వనాథరెడ్డి అభినందించారు.

తిరుపతి

గంగమ్మ జాతరకు చాటింపు




కోడి స్తంభానికి వడిబాలు కట్టి హారతి ఇస్తున్న అర్చకులు - మూలవిరాట్‌కి అభిషేకం - బంగారు ముఖ కవచం, వజ్రకిరీట ధారణతో మెరిసిపోతున్న గంగమ్మ

తిరుపతి(కల్చరల్), మే 14: తిరుపతి గంగమ్మ జాతర ప్రారంభానికి సూచికగా మంగళవారం చాటింపు వేశారు. ఇందులో భాగంగా ఉదయం ఏడు గంటలకు ఆలయం వద్ద కోడి స్తంభాన్ని అభిషేకించి, నూతన వస్త్రాలతో అలంకరించి, వడిబాలు కట్టారు. తర్వాత మూలవిరాట్‌కి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, పూజలు చేశారు. చాటింపు వేయడంతో ఆలయం వద్ద అమ్మవారి భక్తులు అంబళ్లు పోసి, పొంగళ్లు సమర్పించి, పూజలు చేశారు. గంగమ్మకు పలువురు మహిళలు చీరలు సమర్పించారు.

నేడు బైరాగివేషం

బుధవారం భక్తులు బైరాగివేషంలో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకుంటారు. కాగా, అవిలాల నుంచి బయల్దేరిన అమ్మవారి సారె మంగళవారం రాత్రి పొద్దుపోయాక గంగమ్మ ఆలయానికి చేరుకుంది. అంతకు ముందు సంప్రదాయం మేరకు కైకాల కుటుంబ వారసులు అవిలాల పొలిమేర్లలో సారెను అందుకుని, తిరుపతి నాలుగు దిక్కులా పూజలు నిర్వహించి, చాటింపు నిర్వహించారు.

అమ్మవారి పాటల సీడీ ఆవిష్కరణ



తిరుపతికి చెందిన డాక్టర్ విజయలక్ష్మి రచించిన గంగమ్మ పాటల సీడీ గంగమ్మతల్లి నామావళిని మంగళవారం టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నివాసంలో ఆవిష్కరించారు. వర్ణ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో కోనేరు లక్ష్మీరాజ్యం గానం చేయగా, ఆర్.కల్యాణ్ కుమార్ సంగీతం సమకూర్చారు. దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, దేవదానం, తొండమల్లు పుల్లయ్య పాల్గొన్నారు.



అవిలాల పొలిమేర్లలో సారెను అందుకుంటున్న కైకాల వంశస్తులు

గత ఎన్నికల కంటే స్వల్పంగా తగ్గిన పోలింగ్ శాతం

నాలుగు సెగ్మెంట్లలో స్వల్ప పెరుగుదల.. మూడింట్లో తగ్గుదల

తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా పోలింగ్ శాతం గతం కంటే స్వల్పంగా తగ్గింది. అదే సమయంలో నాలుగు నియోజకవర్గాల్లో స్వల్పంగా పోలింగ్ శాతం పెరిగింది. మిగిలిన మూడు సెగ్మెంట్లలో తగ్గుదల కనిపించింది. జిల్లావ్యాప్తంగా 78.63 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో జిల్లా పోలింగ్ శాతం 78.76 శాతం. దానితో పోలిస్తే ఈ పర్యాయం 0.13 శాతం తగ్గింది. అయితే అదేమీ పరిగణనలోకి తీసుకోవాల్సిన స్థాయిలో లేదు. కాగా నియోజకవర్గాల వారీగా చూస్తే చంద్రగిరిలో గత ఎన్నికల కంటే 1.79 శాతం పోలింగ్ పెరిగింది. వెంకటగిరిలో 1.51 శాతం పెరుగుదల కనిపించింది. గూడూరులో మునుపటి కంటే 1.01 శాతం ఎక్కువ పోలింగ్ జరిగింది. శ్రీకాళహస్తిలో 0.82 శాతం గతం కంటే ఎక్కువ నమోదైంది. తిరుపతిలో ఇదివరకటి కంటే 3.29 శాతం పోలింగ్ తగ్గింది. సత్యవేడులో గతం కంటే 1.54 శాతం తక్కువగా నమోదైంది. సూళ్లూరుపేటలో 0.35 శాతం పోలింగ్ గతంకంటే తక్కువగా నమోదైంది.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం

నియోజకవర్గం	2019	2024	తేడా
వెంకటగిరి	79.36	80.87	+1.51
గూడూరు	77.88	78.89	+1.01
సూళ్ళూరు పేట	83.27	82.92	-0.35
సత్యవేడు	86.82	85.28	-1.54
శ్రీకాళహస్తి	82.43	83.25	+0.82
చంద్రగిరి	78.10	79.89	+1.79
తిరుపతి	66.61	63.32	-3.29
మొత్తం	78.768	78.63	-0.13

దొంగ ఓట్లతో గెలవాలని చూసినా వైసీపీ ఆటలు సాగలేదు

తిరుపతిలో కేంద్ర బలగాలు, యంత్రాంగం బాగా పనిచేసింది

ఈవీఎంలు మెరుగ్గా పనిచేసి ఉంటే పోలింగ్ శాతం మరింత పెరిగేది

ఎన్డీయేదే విజయం

అందరికీ కృతజ్ఞతలు తెలిపిన కూటమి నేతలు


మీడియాతో మాట్లాడుతున్న ఎన్డీయే కూటమి నాయకులు

తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎన్డీయే కూటమి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. దొంగ ఓట్లతో గెలవాలని వైసీపీ తీవ్రంగా ప్రయత్నించిందని.. ఎన్డీఏ నేతలు ఎక్కడికక్కడ దొంగ ఓటర్లను పోలీసులకు పట్టించడంతోపాటు కేంద్ర భద్రతా దళాలు దొంగ ఓటర్లపై కఠినంగా వ్యవహరించడంతో వారి ఆటలు సాగలేదన్నారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో ఎన్డీయే బలపరచిన జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావులు కూటమి నేతలతో కలసి మీడియాతో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పోలింగ్‌కు అన్నివిధాలా సహకరించారని చెప్పారు. ఈవీఎంలు మరింత మెరుగ్గా పనిచేసి ఉంటే పోలింగ్ శాతం ఇంకా పెరిగేదని అభిప్రాయపడ్డారు. ప్రశాంత పోలింగ్ నిర్వహణకు కృషి చేసిన కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, రిటర్నింగ్ అధికారి అదితి సింగ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. జనసేనాని పవన్ కల్యాణ్ ఆలోచనా విధానం, మాజీ సీఎం చంద్రబాబు అనుభవం, ప్రధాని మోదీ అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారన్నారు. తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక తిరుపతి ప్రశాంతత, తిరుమల పవిత్రతను కాపాడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేతలు నరసింహయాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, పులిగోరు మురళీకృష్ణా రెడ్డి, ఊకా విజయ్ కుమార్, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, చినబాబు, బుల్లెట్ రమణ, బీజీ కృష్ణయాదవ్, పుష్పావతి యాదవ్, మహేష్ యాదవ్, కంకణాల రజినీకాంత్, బీజేపీ నేతలు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, పొనగంటి భాస్కర్, వరప్రసాద్, జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజారెడ్డి, లక్ష్మీపతి, సుభాషిణి, కీర్తన, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భూమన బహిరంగ క్షమాపణ చెప్పాలి

పాత్రికేయులకు ఏదైనా హాని జరిగితే ఆయనదే బాధ్యత - ఎన్డీయే నేతల డిమాండ్


మీడియాతో మాట్లాడుతున్న ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఉమామహేశ్వర రావు, స్టాఫ్ రిపోర్టర్ నరేంద్రల అంతు చూస్తామని బెదిరించిన టీటీడీ ఛైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎన్డీయే కూటమి నేతలతోపాటు జర్నలిస్టు సంఘ నేతలు డిమాండు చేశారు. పాత్రికేయులకు ఏదైనా హాని జరిగితే భూమనే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతి ప్రతినిధులపై విచక్షణ కోల్పోయి మాట్లాడిన భూమనపై చర్యలు తీసుకోవాలని టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో డిమాండు చేశారు. వైసీపీ ఎన్నికల ప్రచార సభలో ఈనాడు అధినేత రామోజీరావును గుంటనక్క అంటూ కరుణాకరరెడ్డి దుర్భాషలాడారు.. గతంలో ఆ సంస్థలో పనిచేసిన రోజులు మరిచిపోయారా.. ఆయనేంటో మీకు తెలియదా.. అంటూ ప్రశ్నించారు. అదేవిధంగా ప్రచారం ముగింపు సభలో ఆంధ్రజ్యోతి ప్రతినిధులపై ఆవేశంతో ఊగిపోతూ నోటికొచ్చినట్టు తూలనాడుతుంటే చెరోవైపు ఉన్న ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీషలు దిగ్భ్రాంతికి గురైనట్టు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అంటేవారికి కూడా కరుణాకర రెడ్డి మాట్లాడేవన్నీ పచ్చి అబద్ధాలని అర్థమైందన్నారు. మీ అరాచకాలు, అవినీతిపై కథనాలు రాసినందుకు కక్షతో టీటీడీ ఛైర్మన్‌గా ఉంటూ దిగజారుడు వ్యాఖ్యలు చేయవచ్చా? పోలింగ్ ముందు రోజు కలెక్టర్, ఎస్పీలకు జర్నలిస్టు సంఘాలు ఫిర్యాదు చేశారని, విచారణ ఎంతవరకు వచ్చిందో బయటపెట్టాలని డిమాండు చేశారు. లేకుంటే ఎన్డీయే తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు కరాటే చంద్ర, సుబ్బు యాదవ్, గంజి సుధాకర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నాగప్రతాప్, ప్రేమ్, ముని పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే..

బహిరంగ సభలో ఓట్లు అడగాలే కానీ.. పాత్రికేయులను తూలనాడడమేంటి? భవిష్యత్తులో వారికి ఏది జరిగినా భూమన కుటుంబమే బాధ్యులు. కొడుకు ఓటమి చెందుతాడన్న భయంతోనే పాత్రికేయులపై నోటికొచ్చినట్టు వ్యాఖ్యలు చేశాడు. ప్రజలు తీర్పు ఇచ్చేశారు. ఇక ఆయన ఇంటికే పరిమితం. ఇప్పటికైనా పాత్రికేయులకు బహిరంగ క్షమాపణలు చెప్పి, పద్ధతిగా మాట్లాడటం నేర్చుకోవాలి.

- ఆరణి శ్రీనివాసులు, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి

చాలా బాధేసింది

టీటీడీ ఛైర్మన్ హోదాలో ఉండి కూడా కారణం లేకుండా జర్నలిస్టులను తూలనాడడం సంస్కారం కాదు. ఆయన చెడు ఆలోచనలతో ఉన్న వ్యక్తి కాబట్టే అందరూ అదే అనుకుని మాట్లాడతారు. దివంగత ఎమ్మెల్యే వెంకటరమణపై చేయిచేసుకుంటే 2014లో ఓటర్లు ఏవిధంగా పాఠం నేర్పించారో ఆయనకు తెలుసు. తెలివిగలవాడు.. గతం నేర్పిన గుణపాఠాలు నేర్చుకుంటాడు. కానీ ఆయన విచక్షణ కోల్పోయి, పాత్రికేయులను తూలనాడి నెత్తిన చెత్త వేసుకున్నాడు. ఆయన అన్నమాటల పాపాలు పోవాలంటే వారికి భేషరతుగా క్షమాపణ చెప్పాలి.

- వరప్రసాదరావు, బీజేపీ ఎంపీ అభ్యర్థి

ఇదేనా నీ మానవీయ విలువలు

నిలువెత్తు మానవతా విలువలను నింపుకున్న వ్యక్తిగా వేషం వేసుకుని కనిపించే కరుణాకర రెడ్డి.. ఆంధ్రజ్యోతి ప్రతినిధులను నోటికొచ్చినట్టు తూలనాడడం సభ్యసమాజం తలవంచుకుంటోంది. ఓడిపోతామన్న ఫ్రస్టేషన్లో బహిరంగ సభలో విచక్షణ కోల్పోయి.. నిరాధార ఆరోపణలు చేస్తూ.. అసభ్య పదజాలాన్ని వాడారు. భూమన కుటుంబ అరాచకాలను పత్రికల్లో ఎండగడుతున్నారన్న కక్షతోనే వారిపై విరుచుకుపడ్డారు. ఆ ఇద్దరు పాత్రికేయులకు ఆయన లేదా ఆయన అనుచరుల నుంచి హాని జరిగితే భూమన కుటుంబమే బాధ్యత వహించాలి. మేము అధికారంలోకి రాబోతున్నాం. భూమన వ్యాఖ్యలపై చర్యలు తీసుకుంటాం.

- సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ

రాజకీయ నాయకులకు విజ్ఞత ఉండాలి: ఏపీజేఎఫ్

టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీజేఎఫ్) అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. 'ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఉమామహేశ్వరరావు, స్టాఫ్ రిపోర్టర్ నరేంద్రల పేర్లు ప్రస్తావిస్తూ ఆయన చేసిన ఆరోపణలు ఎంతమాత్రం సమంజసమైనవి కావు. మీడియాలో వచ్చిన వార్తల్లో తప్పులు, పొరబాట్లు ఉంటే వాటిపై వివరణ ఇవ్వాలి. తీవ్రమైనవని భావిస్తే కోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుంది. అందుకు భిన్నంగా ఏమాత్రం సంబంధంలేని విధంగా ఆరోపణలు చేయడం, వారిని కబ్జాదారులని వ్యాఖ్యానించడం ఎంత మాత్రం సరికాదు. రాజకీయ నాయకులుగా విజ్ఞతతో ఉండాలి. దీనికి భిన్నంగా వ్యవహరించే వైఖరిని విడనాడాలి' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రిమినల్ కేసులు పెట్టాలి

గౌరవప్రదమైన టీటీడీ ఛైర్మన్ హోదాలో ఉండి ఆంధ్రజ్యోతి ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడమేంటి? ఇవి మంచి పద్ధతి కాదు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్యవారధిగా ఉండే పాత్రికేయులకు కరుణాకరరెడ్డి క్షమాపణలు చెప్పాలి. బెదిరింపు ధోరణితో మాట్లాడిన ఆయన తీరుపై విచారణ చేసి.. క్రిమినల్ కేసులు పెట్టాలి. జగన్ గ్రహణం వీడిపోయింది. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరించే వారి ఆటలు ఇక సాగవు.

- భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ నాయకుడు

టీడీపీకి ఓట్లు వేస్తారా అంటూ గర్భిణిపై దాడి

మాజీ వలంటీర్ తమ్ముడి నిర్వాకం



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

పెళ్లకూరు, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తారా అంటూ ఓ గర్భిణిపై మాజీ వలం టీర్ మాలతి సోదరుడు తేజ దాడి చేశాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి ఆలస్యంగా వెలు గులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు... తమిళనాడుకు చెందిన వి.కృష్ణన్ కుటుంబం సహా మరికొన్ని పెళ్లకూరుమిట్టలో నివాసం ఉంటున్నాయి. కృష్ణన్ మనవరాలు వి.అరుణకు ఇక్కడ ఓటు ఉంది. ఈ క్రమంలో సోమవారం ఓటు వేసింది. సోమవారం సాయంత్రం మాజీ వలంటీర్ పెద్ద నాన్న కృష్ణయ్య... కృష్ణన్ ఇంటికి వచ్చి టీడీపీకి ఓటు వేశారా ప్ర శ్నించారు. తాము ఎవ్వరికి ఓటేశామో ఎందుకు చెప్పాలని ప్రశ్నించడంతో ఆయనపై దాడికి యత్నించారు. అక్కడే ఉన్న అరుణ అడ్డుకోవడంతో మాజీ వలంటీర్ సోదరుడు తేజ ఆమెను కాలితో తన్నాడు. దీంతో ఆమెను కుటుం బీకులు శ్రీకాళహస్తికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్సల అనంతరం తిరుపతి మెటర్నటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సల అనంనతం మంగళ వారం రాత్రి పోలీస్‌స్టేషన్ వచ్చి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు. పోలీ సులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలిని టీడీపీ మండల అధ్యక్షు డు సంచి కృష్ణయ్య, నాయకులు పేరం మధుసూధన్‌నాయుడు తదితరులు అరుణను పరామర్శించారు.

కార్యకర్తల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు, మే 14: టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఆ పార్టీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీడీపీ గెలుపు ఖాయమని తెలుసుకుని పోలింగ్ శాతాన్ని తగ్గించేందుకు తమ పార్టీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడులకు పాల్పడ్డారన్నారు. దుర్భాషలాడుతూ, పోలీసులను అడ్డు పెట్టుకుని దౌర్జన్యాలకు దిగారన్నారు. సోమవారం ఎన్నికల సమయంలో చిల్లకూరులో తమ కార్యకర్తలపై దాడి చేసిన ఎస్ఐ అంజిరెడ్డిపై ఎన్నికల కమిషన్, ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలపై దాడులకు దిగ డం, ఆస్తులకు నస్టం కలిగించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గౌరవ ప్రదమైన ఎమ్మెల్సీ స్థానంలో ఉండే వైసీపీ అభ్యర్థి ఈ తరహా చర్యలను ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమన్నారు. చిల్లకూరు మండలం చింతవరంలో టీడీపీ కార్యకర్త గోపాల్‌పై దాడికి దిగడం, తిప్పగుంటపాళెంలో చిల్లకూరు మండల అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి రొయ్యల గుంటల్లో విషప్రయోగం జరిపి నష్టం కల్పించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటి వరకు గూడూరులో లేని ఈ తరహా సంస్కృతికి వైసీపీ నాయకులు తీసుకు రావడాన్ని ఖండిస్తున్నామన్నారు. నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, వెంకటేశ్వర్లురెడ్డి, కిశోర్‌నాయుడు, బాలకృష్ణమనాయుడు, ఇంద్రవర్ధన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిచేది నేనే: కురుగొండ్ల రామకృష్ణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి/ డక్కిలి, మే 14:వెంకటగిరి ఎమ్మెల్యేగా గెలిచేది తానేనని, సీఎంగా కుర్చీలో కూర్చునేది చంద్రబాబేనని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురు గొండ్ల రామకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన నివాసంలోని పార్టీ చాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ సరళిని చూస్తేనే టీడీపీ విజయం తథ్యమని ప్రజలే చెబుతున్నారన్నారు. ఓటమి భయంతోనే వైసీపీ అల్లర్లకు తెగబడుతోందన్నారు. గత ఐదేళ్ల జగన్ రాక్షసపాలనను చూసిన ప్రజలు ముఖ్యంగా యువత ఇతర దేశాలు, రాష్ట్రాలనుంచి వచ్చి కసితో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. వెంకటగిరి మున్సిపాలిటీలో 10 వేల నుంచి 15 వేల మెజారిటీ, నియోజకవర్గంలోని 6 మండలాల్లో మరో 15 వేల నుంచి 20 వేల మెజారిటీ వస్తుందని మొత్తం 35 వేల మెజార్టీతో తాను గెలవడం ఖాయమన్నారు. బి.రాజేశ్వరావు, సి.సి.నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, జి.శ్రీనివాసులు, గొల్లగుంట మురళీ, రమణయ్య, టి.రామచంద్రయ్య, నాగరాజు, జనసేన పార్టీ నాయకులు అనీల్, రాజేష్ పాల్గొన్నారు. చంద్రగిరి టీడీపీ అభ్యర్థి నానిపై వైసీపీ రౌడీ మూకలు పథకం ప్రకారమే హత్య చేయాలని చూశాయని కురుగొండ్ల రామకృష్ణ మండిపడ్డారు. మంగళవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ రౌడీ మూకలు టీడీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు దిగడం పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు.

టీడీపీని ఆదరించిన అందరికీ కృతజ్ఞతలు

● నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల



నాయుడుపేట, మే 14: టీడీపీని ఆదరించిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలకు, ఏజెంట్లకు మాజీ ఎంపీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రశాంత పోలింగ్‌కు సమర్థవంతంగా పనిచేసిన పోలీసులు, అధికార యంత్రాంగాన్ని అభినందించారు. ఎన్డీఏ కూటమి ఇచ్చిన ప్రజారంజక సూపర్ సిక్స్ మ్యానిఫెస్టో అన్ని కులాల, మతాల, అన్ని రంగాల ప్రజలను ఆకట్టుకుందని టీడీపీపై ఉన్న నమ్మకంతో కూటమికి ఓట్లతో నీరాజనాలు పలికారన్నారు.

నెలవల విజయశ్రీని కలిసిన టీడీపీ నాయకులు



సూళ్లూరుపేట, మే 14: ఎన్ని కలు పూర్తికావడంతో ఉమ్మడి అభ్యర్థి నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యంను మంగళవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఏ.రమేష్ ఆధ్వర్యంలో నా యకులు నాయుడుపేటలోని వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా వారిని విజయశ్రీ అభినందించారు. గెలు పు తమదేనని అందరూ సంబరాలకు సిద్ధంగా ఉండాలన్నా రు. టీడీపీ నాయకులు ఈవీవీ సురేష్, మేడా సాయి, వెంకీయాదవ్, రమణయ్య తదితరులు ఉన్నారు.

మీ సహకారం మరువలేనిది

పెళ్లకూరు, మే 14: సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు డాక్టర్ నెలవల విజయశ్రీ, డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు గెలుపు కోసం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు కృషి మరువలేనిదని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఉయ్యాల ప్రవీణ్‌ను సత్కరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల్లో తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిస్తామన్నారు.

సూళ్లూరుపేటలో పైచేయి ఎవరిదో?

గెలుపు ధీమాలో టీడీపీ ● వెన్నుపోట్లతో ఆందోళనలో వైసీపీ



తడ, మే 14: పోలింగ్ ముగిసింది. ప్రజలు భారీగా తరలివచ్చి ఓటు వేశారు. ఇది తమకు అనుకూలమని తమదే విజయమని టీడీపీ, వైసీపీలు ధీమాగా ఉన్నా ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో పైచేయి ఎవరిదన్నది చర్చనీయాంశమైంది. సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్‌తోపాటు 9 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్యే పోటీ జరిగింది. నియోజక వర్గంలో 6 మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో జోరుగా ప్రచారం సాగింది. పోలింగ్ రోజు అదే కొనసాగింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో వైసీపీకి కొంత అనుకూల ఓటు నమోదైందని అంటున్నా... వైసీపీలోని అసమ్మతి నాయకులు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా పెళ్లకూరు, సూళ్లూరుపేట, తడ మండలాలలో ఈ ప్రభావం కొంత కనబడింది. దానికి తోడు పట్టణ ఓటర్లల్లో వైసీపీ వ్యతిరేకత టీడీపీకి కలిసొచ్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అటు వెన్నుపోట్లు, ఇటు ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఆ వైసీపీకి కొంత ప్రతికూల ఫలితాన్ని ఇస్తుందని చర్చలు జరుగుతున్నాయి. ఇక టీడీపీ విషయానికి వస్తే మొదట్లో కొంత కుమ్ములాటలున్నా ఆ తరువాత అవన్నీ సద్దుమణగడం ఆ పార్టీకి కలిసొచ్చింది. గతంలో లాగా కాకుండా పోలింగ్ రోజు వరకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా టీడీపీకి పోలయ్యేలా చేయడంలో సఫలీకృతుల య్యారు. కొన్ని పంచాయతీల్లో టీడీపీకి గుంపగుత్తగా ఓట్లు పడినట్టు సమాచారం. తడ మండలంలోని వాటంబేడు, రామాపురం, వేనాడు, కొండూరు పంచాయతీల తోపాటు నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాల్లో టీడీపీకి భారీ ఆధిక్యత లభించే అవకాశాలున్నాయి. దీంతోపాటు మహిళా ఓటర్లు పురుషులు కన్నా ఎక్కువగా ఓటు వేయడంతో అది టీడీపీకి అనుకూలమని ఆ పార్టీ భావిస్తోంది. కానీ ప్రభుత్వ పథకాలను అందుకున్న మహిళలు తమవైపే మొగ్గు చూపారని తమ పార్టీలో వెన్నుపోట్లు జరిగినా మహిళల ఓట్లతోనే తాము గెలుస్తామంటూ వైసీపీ సైతం అంటోంది. మరీ ఇక్కడ గెలుపు ఎవరిదన్నది ఈవీఎంలు తెరచినప్పుడే బయటపడుతుంది. అందుకోసం జూన్ 4వ తేదీ వరకు వేచి చూడక తప్పదు.

మొత్తం ఓట్లు 2,42,610
పోలైన ఓట్లు : 2,01,173
పోలింగ్ శాతం : 82.92 శాతం
ఓట్లు వేసిన పురుషులు : 99,372 మంది
ఓట్లు వేసిన మహిళలు : 1,01,801 మంది

● 2019 ఎన్నికల కన్నా ఈ దఫా 1.21 శాతం అధికంగా ఓట్లు పోలయ్యాయి

జగన్నాథపురంలో సర్పంచ్ ఇంటిపై వైసీపీ శ్రేణుల దాడి





సర్పంచ్ ఇంట్లో పగిలిన కిటికీ అద్దాలు, సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న గాలి భానుప్రకాష్, సర్పంచ్‌ని విచారిస్తున్న పోలీసు అధికారులు

విజయపురం, మే 14: మండలంలోని జగన్నాథపురంలో సర్పంచ్ రాజెమ్మనారాయణరాజు ఇంటిపై సోమవారం అర్ధరాత్రి వైసీపీ శ్రేణులు దాడి చేశాయి. పోలీసు కథనం మేరకు ... సోమవారం పోలింగ్ అనంతరం సాయంత్రం 7 గంటల సమయంలో వైసీపీ , టీడీపీ వర్గీయుల మధ్య తేలికపాటి ఘర్షణ జరిగింది. పోలీసులకు సమాచారం అందడంతో ఇరువర్గాలు పరారయ్యారు. అనంతరం అర్ధరాత్రి వైసీపీ వర్గీయులు దుండగులను పోగు చేసుకొని సర్పంచ్ ఇంటిపై రాళ్లతో, పెద్ద కర్రలతో దాడి చేయడంతో కిటికీ అద్దాలు, కారు బ్యాక్‌లైట్ ధ్వంసమయ్యాయి. వెలుపల నిద్రిస్తున్న సర్పంచ్ కుమారుడు జగదీష్‌కు గాయాలు కావడంతో తిరుపతిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న వెంటనే డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ జయప్ప సంఘటనా స్థలానికి చేరుకొని సర్పంచ్ దంపతులను విచారించారు. విధ్వంసానికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేశామని, త్వరలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

గాలి భానుప్రకాష్ పరామర్శ

సర్పంచ్ కుటుంబాన్ని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పరామర్శించారు. సర్పంచ్ ఇంటిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు, రాష్ట్ర టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, వందలాది మంది టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉదయం 3గంటలకు నగరికి కలెక్టర్

నగరి, మే 14: నగరి నియోజకవర్గంలోని 231 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలను ఆలస్యంగా మంగళవారం మధ్యాహ్నం చిత్తూరుకు భారీ బందోబస్తు మధ్య తరలించారు. ఈవీఎంల సేకరణ ఆలస్యం కావడంతో పోలింగు సిబ్బంది నానా తంటాలు పడ్డారు.ఈ నేపథ్యంలో నగరి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ షన్మోహన్ మంగళవారం ఉదయాత్పూర్వం తనిఖీ చేశారు. ఈవీఎంల సేకరణలో రిటర్నింగ్ అధికారి సరైన చర్యలు చేపట్టలేదని ఎన్నికల సిబ్బంది వాదోపవాదాలకు దిగడంతో స్పందించిన కలెక్టర్ నగరికి మంగళవారం ఉదయం 3గంటలకు చేరుకున్నారు. ఎన్నికల అధికారిపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ మూక కత్తితో దాడి



మెడ కింద కట్టుతో గోపి

నాయుడుపేట టౌన్, మే 14: టీడీపీ కార్యకర్త నెలవల గోపిపై వైసీపీ వర్గీయులు కత్తితో దాడి చేశారు. నాయుడుపేట మండలం మాబాకలో ఈ సంఘటన జరిగింది. బాధితుడి కథనం మేరకు... ఎన్నికల సందర్భంగా నెలవల గోపి టీడీపీ తరఫున ఆటోలో నియోజకవర్గంలో ప్రచారం చేపట్టాడు. సోమవారం ప్రయాణికులను ఎక్కించుకొని ద్వారకాపురానికి వెళ్లాడు. అదే సమయంలో వైసీపీ వర్గీయులకు గోపి మధ్య వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో మంగళవారం గోపి ప్రయాణికులతో మాబాక గ్రామానికి వెళ్లాడు. అక్కడే ఉన్న వైసీపీ వర్గీయులు ప్రతాప్, రంగయ్య, మణి ద్వారకాపురంలో జరిగిన సంఘటనను మనస్సులోపెట్టుకుని మాబాకకు ఎందుకొచ్చావని అడిగారు. దీంతో వారి మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. ఉన్నట్టుండి ప్రతాప్, రంగయ్య, మణి కత్తితో గోపీ గొంతుపై తీవ్రంగా గాయపరిచారు. అక్కడే ఉన్న స్థానికులు అడ్డుకుని గాయపడ్డ గోపిని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో గోపి ఫిర్యాదు చేశాడు.

నాదస్వర విద్వాంసుడికి టాప్‌గ్రేడ్ సర్టిఫికెట్



సర్టిఫికెట్‌ను అందుకుంటున్న సుధాకర్

చిల్లకూరు, మే 14: మండలంలోని వరగలికి చెందిన నాదస్వర విద్వాంసుడు సుధాకర్ ఏ-టాప్‌గ్రేడ్ సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. మంగళవారం విజయవాడలోని ఆకాశవాణి విజయవాడ స్టేషన్‌లో డైరెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. 40ఏళ్లుగా సుధాకర్ ఆకాశవాణిలో పలు గ్రేడ్‌లలో నాదస్వర విద్వాంసుడుగా పని చేస్తున్నాడు. ప్రతిభనుబట్టి ఈ గ్రేడ్‌లను ఆకాశవాణి స్టేషన్ కేటాయిస్తుందన్నారు. దీంతో పలువురు ఆయన్ను అభినందించారు.

గడ్డివామి దగ్ధం

కోట, మే 14: మండల పరిధిలోని రుద్రవరంలో మంగళవారం గడ్డివామి దగ్ధమైంది. కోట దళితవాడకు చెందిన యల్లశిరి మస్తానయ్య తన 5 ఎకరాలలోని గడ్డిని ఆ పొలాల్లో వామిగా వేసి ఉన్నాడు. వామి విద్యుత్ మెయిన్ లైన్ కింద ఉండటంతో షార్ట్‌సర్క్యూట్‌కు గురై కాలి బూడిదైంది. కోట నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పేలోగా కాలి బూడిదైంది.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో ప్రైవేటు విద్యార్థుల ప్రతిభ

నాయుడుపేట, మే 14: ఏపీఆర్‌జేసీ మంగళవారం వెల్లడించిన పరీక్షా ఫలితాల్లో నాయుడుపేట పట్టణంలోని శస్త్ర విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎస్. వరుణ్ సందేశ్ రాష్ట్రస్థాయి 63వ ర్యాంక్, ఇ.మునితనూజ 527, కె. రుద్రకేశవమూర్తి 727 ర్యాంక్ సాధించారు. వీరిని శ్రీవేమ విద్యాసంస్థల అధినేత పి.శ్రీనివాసులురెడ్డి, శస్త్ర కరస్పాండెంట్ ఎల్.హరిబాబు అభినందించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

వైసీపీ నాయకుల అరాచకాలు



చికిత్స పొందుతున్న గోపాల్

చిల్లకూరు, మే 14: ఎన్నికల అనంతరం మండలంలో వైసీపీ నాయకుల అరాచకాలకు పాల్పడుతున్నారు. టీడీపీ నాయకులపై దాడులకు దిగడం, ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారు. మంగళవారం మండలంలోని చింతవరంకొత్తపాళేనికి చెందిన గోపాల్ అనే వ్యక్తిపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. స్థానికుల కథనం మేరకు... చితవరంకొత్తపాళేనికి చెందిన గోపాల్ టీడీపీ నాయకుడు. చింతవరంలో ఎరువుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ ఎన్నికల్లో టీడీపీ తరఫున ఆ గ్రామంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. దీంతో మంగళవారం గోపాల్ దుకాణంలో ఉండగా బైక్‌లపై వచ్చిన వైసీపీ నాయకులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ గోపాల్‌ను చిల్లకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు క్రాంతి, దిలీప్, చెంచయ్యాలు పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రొయ్యలగుంటలో విషం చల్లారు...



చిల్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి రొయ్యగుంటలో గుర్తుతెలియని వ్యక్తులు విషం కలపడంతో నష్టం వాటిల్లింది. ఈ ఎన్నికల్లో టీడీపీ పక్షాన ప్రచారం నిర్వహించడంతో వైసీపీ నాయకులు తిప్పగుంటపాళెంలోని ఆయన రొయ్యలగుంటల్లో సోమవారం విషం కలిపారు. మంగళవారం రొయ్యలను పట్టాల్సి ఉండగా సోమవారం విషం చల్లడంతో రొయ్యలన్నీ చనిపోయాయి. దీంతో రూ. 15లక్షల వరకు నష్టం వాటిల్లిందని వెంకటేశ్వర్లు రెడ్డి చెప్పారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలింగ్ రోజైన సోమవారం చిల్లకూరులోని 114, 115 బూత్‌లలో వైసీపీ నాయకులు టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ సహా నాయకులపై దాడికి పాల్పడిన సంఘటన విదితమే. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి ఈ తరహా చర్యలకు పాల్పడకుండా వైసీపీ నేతలను కట్టడి చేయాలని వెంకటేశ్వర్లు రెడ్డి కోరారు.

భారీ భద్రత నడుమ ఈవీఎంల తరలింపు




సూళ్లూరుపేట, మే 14: సూళ్లూరుపేట నియోజక వర్గానికి సంబంధించిన ఈవీఎంలను మంగళవారం భారీ భద్రత నడుమ ప్రత్యేక వాహనాల్లో జిల్లా కేంద్రం తిరుపతి స్ట్రాంగ్ రూములకు తరలించారు. నియోజకవర్గంలో మొత్తం 304 పోలింగ్ పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను ఆర్వో చంద్రముని ఆధ్వర్యంలో అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించిన స్థానిక జూనియర్ కళాశాల మైదానంలోని స్ట్రాంగ్ రూంల నుంచి వేర్వేరు వాహనాల్లో తీసుకెళ్లారు. నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, సీఐ మధుబాబు, ఎస్ఐలు రఘునాథ్, తిరుమలరావు ఆధ్వర్యంలో భద్రతా సిబ్బంది ఈవీఎంల వాహనాల వెంట వెళ్లారు. వీరి వెంట ఏఆర్వో కేవి గోపాలకృష్ణ, తడ, నాయుడుపేట తహసీల్దార్లు ఇక్బాల్, కల్యాణి, ఎన్నికల డీటీ పవన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తదితరులు ఉన్నారు.

గూడూరులో...

గూడూరు: గూడూరు నియోజకర్గంలో జరిగిన ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను మంగళవారం తిరుపతి పద్మావతి కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు తరలించారు. నియోజకవర్గంలో ఎన్నికలు ముగిసిన అనంతరం ఈవీఎంలను స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. అక్కడ నుంచి పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనంలో తిరుపతి పద్మావతి కళాశాలకు తరలించారు. ఈ ఏర్పాట్లను ఆర్వో కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.

పల్లె ఓటర్లలో చైతన్యం... ఫలించిన అధికారుల ప్రయత్నం

సూళ్లూరుపేట, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల చైతన్యంతో గ్రామీ ణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం బాగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సూళ్లూరుపేట మండలంలో దాదాపు 17 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతం మించి ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు బాగా ఫలించాయి. తీర గ్రామాలైన కొడిడి, పేర్నాడు, కడపత్ర, రాగన్నపట్టెడ గ్రామాల్లో రోడ్డు వేస్తేనే ఓటేస్తాం లేదంటే బహిష్కరిస్తామన్న ప్రజలు ఓటు వేసేందుకు బారులు తీరి మరీ వేయడం విశేషం. ఈ గ్రామాల్లో ఆర్వో చంద్రముని, ఏఈఆర్వో కేవి గోపాలకృష్ణ, పోలీసులు అక్కడ గ్రామాల్లో తిరిగి మరీ ఓటు విలువ గురించి తెలియజేసి అందరూ ఓటింగ్‌లో పాల్గొనే విధంగా అవగాహన కల్పించారు. అదే విధంగా పడమలి పల్లెల్లో కూడా బాగా ఓటింగ్ శాతం పెరిగింది. మండలంలో సామంతమల్లాం 96.21 శాతం అధికంగా పోలింగ్ నమోదు అయ్యింది. అదే విధంగా కుదిరిలో 95.68, పెరిమిటిపాడు 94.54, కొణ్డంబట్టు 94.24, సుగ్గుపల్లి 94.09, ఉగ్గుముడి 92.75, వెలగలపొన్నూరు 92.68, కొరిడి 90.40, దామరాయి 92.11, రాగన్నపట్టెడ 91.52, మన్నెముత్తేరి 92.18, కొమ్మినేనిపల్లి 90.88, మతకాముడి 91.13, మంగానెల్లూరు 90.74,, డేగలపాలెం 91.34 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. మండలంలో 33 పోలింగ్ కేంద్రాలు ఉండగా 17 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతం పైగా పోలింగ్ నమోదు కావడం విశేషం. పోలింగ్ 90 శాతం పై బడి నమోదైన గ్రామాలన్నీ టీడీపీకి కలిసి వచ్చే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి. దాదాపు 17 గ్రామాల్లో అధికంగా పోలింగ్ నమోదు కాగా అందులో మన్నెముత్తేరి మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో టీడీపీకి మంచి పట్టుంది.

దోషులను కఠినంగా శిక్షించాలి

● దళిత సంఘాల నాయకుల డిమాండ్



ఆందోళన చేస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

వెంకటగిరి, మే 14: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులను 24 గంటల్లోగా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఘటనా స్థలం నుంచి క్రాస్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దోషులను వెంటనే అరెస్టు చేయని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వ నిధులతో విగ్రహాన్ని యథాతథంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ ధర్మపోరాట సమితి నాయకుడు గోపాల్, నవజీవన్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు సహదేవయ్య, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుడు గద్దల మునయ్య, 5వ వార్డు కౌన్సిలర్ నారి శేఖర్, ఏఐటీయూసీ నాయకుడు జాన్, నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, డి.రామకృష్ణ, పి.ధనుంజయ, ఎం.సురేష్, కె.రవి, చంద్ర, వెంకటేశ్వర్లు, చెంచుకృష్ణయ్య, సురేష్, వెంకటాద్రి, నరసింహులు, భాస్కర్, న్యాయవాది వేణు, చిట్టేటి రాజా పాల్గొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి

తడ, మే 14: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకున్నారు. తడ బస్టాండ్ కూడలిలో కారుషెడ్ వెనుక సోమవారం రాత్రి సుమారు 65 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుడు. మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి పరిశీలించారు. ఎటువంటి ఆధారాలు లభించలేదు. దీంతో మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నాంచారమ్మ గుడి హుండీ ధ్వంసం

డక్కిలి, మే 14 : మండలంలోని కుప్పాయపాళెం సమీంపలో కొలువై ఉన్న నాంచారమ్మ గుడిలో గుర్తు తెలియని దుండగులు మంగళవారం తెల్లవారు జామున తలుపులను ధ్వంసం చేసి హుండీని పగులగొట్టి నగదును చోరీ చేసినట్లు గ్రామస్తులు పోలీసుకు ఫిర్యాదు చేశారు. హుండీలో ఉన్న సుమారు రూ.20 వేల నగదు సహా అమ్మవారి సూలాన్ని ఎత్తుకెళ్లారు.

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళి

గూడూరులో 78.90శాతం పోలింగ్ నమోదు

గూడూరు, మే 14: గూడూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఓటర్లు 6గంటల సమయం దాటినా ఓట్లు వేసేందుకు వేచివుండడంతో పోలింగ్ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఈ ఎన్నికల్లో పురుషుల ఓట్లు 1,19,164, మహిళల ఓట్లు 1,26,007, ఇతరుల ఓట్లు 34 ఉండగా మొత్తం 2,45,205 మంది ఓటర్లుగా ఉన్నారు. సోమవారం 95,436 మంది పురుషులు, 98,016 మంది మహిళలు, 13 మంది ఇతరులు... మొత్తం 1,93,458 మంది ఓటు వేశారు. 78.90శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కోటలో 79.87 శాతం పోలింగ్

కోట, మే 14: కోట మండలంలోని 21 పంచాయతీలకు గాను 52 పోలింగ్ కేంద్రాల్లో 79.87 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దారు నాగరాజారావు, ఎంపీడీవో శంకరయ్య మంగళవారం తెలిపారు. మండలంలో 42,134 మంది ఓటర్లు ఉండగా, 33,815 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 20,390మంది పురుష ఓటర్లుకు గాను 16,457 మంది, 21,740 మంది మహిళా ఓటర్లకు గాను 17,358 మంది ఓటు వేశారు.

మా అభ్యర్థిదే గెలుపు!

గ్రామాల్లో రచ్చబండ చర్చలు

ఓజిలి, మే 14: ఎన్నికల సమరం ముగిసింది... మెల్లగా ఎన్నికల వేడి కూడా చల్లబడుతోంది... బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో భద్రంగా ఉండగా వారి గెలుపుపై రచ్చబండ సమావేశాలకు తెరలేచింది. ఓజిలి మండలంలో వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య, కూటమి అభ్యర్థిగా టీడీపీ నుంచి నెలవల విజయశ్రీ గెలుపుపై చర్చిస్తున్నారు. తమ విజయం వెనుక జగనన్న పథకాలే శ్రీరామ రక్షగా ఉంటాయని అధికార పార్టీ నాయకులు అంటుండగా ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి అక్రమాలు తమ అభ్యర్థి గెలుపు నల్లేరుమీద నడకేనంటున్నారు. కురుగొండ, ఓజిలి, ఆరిమేనిపాడు, సగుటూరు, ఇనుగుంట, అత్తివరం, కరబల్లవోలు, గ్రద్దగుంట, చిల్లమానుచేను, వెంకటరెడ్డిపాళెం సచివాలయాల పరిధిలో పంచాయతీల్లో బూత్‌ల వారీగా పోలింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. వృద్ధులు కూడా చర్చల్లో పాల్గొంటూ తమ అనుభవాలను పంచుకుంటున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి అన్ని ఎన్నికల్లో ఓజిలి మండలంలో ఆ పార్టీ మెజారిటీని నిలబెట్టుకోగా వైసీపీ ఏర్పాటైన నాటినుంచి బీటలు పడ్డాయి. ఈనేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల్లో తిరిగి టీడీపీ పూర్వవైభవం సంతరించుకుంటుందని రచ్చబండ చర్చ జరుగుతోంది.

వైసీపీ గూండాలను అరెస్టు చేయాలి: బీజేపీ



మీడియాతో మాట్లాడుతున్న వరప్రసాద్, కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, మే 14: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి పోలింగ్ బూత్ నెంబరు 28 వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు కూనాటి నాగరాజుపై దాడి చేసిన వైసీపీ గూండాలను వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు, రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు అక్కుర్తిలోని కూనాటి నాగరాజు స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కుటుంబానికి భరోసా ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ నాగరాజుపై దాడి చేసిన వైసీపీ గూండాలను వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని హెచ్చరించారు. రూరల్ సీఐ అజయ్‌కుమార్‌ను వెంటనే విధులు నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశాంతంగా ఎన్నికలు జరగాల్సి ఉండగా వైసీపీ నాయకులు స్థానికేతురలను ప్రోత్సహించి దాడులు చేయడం సబబు కాదన్నారు. ఇందుకు ప్రోత్సహిస్తున్న పోలీసు యంత్రాంగాన్ని తప్పు పట్టారు. అక్కుర్తి గ్రామంలో మరో బాధితులు సిద్ధాగుంట సుబ్బరామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్వీ రమణ, వేలవేడు ధర్మయ్య, తేజోవతి, వేడాం కృష్ణయ్య, నాగరాజు, సత్యనారాయణ, వెంకటసుబ్బయ్య, అమర్‌నాథ్, శివారెడ్డి, బిందు కుమార్, రవిచంద్ర, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో 83.25 శాతం పోలింగ్

శ్రీకాళహస్తి, మే 14: శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలో 83.25శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం సార్వత్రిక ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,48,536 మంది ఉండగా, ఇందులో పురుషులు 1,19,973, మహిళలు 1,28,549, ఇతరులు 14మంది ఉన్నారు. ఇందులో 2,06,914 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా 83.25 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్డీవో తెలిపారు.

స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన



ఈవీఎం యంత్రాల తరలింపును పరిశీలిస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మే 14: ఈవీఎం యంత్రాలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌ను ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పరిశీలించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పోలింగ్ పూర్తయిన తరువాత ఈవీఎం యంత్రాలను అధికారులు తిరుపతికి తరలించారు. పద్మావతి యూనివర్సిటీలో భద్రపరిచారు. ఈవీఎం తరలింపు ప్రక్రియను బొజ్జల సుధీర్‌రెడ్డి టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో రిషితారెడ్డి, మునిరాజానాయుడు, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సినీ హీరో కృష్ణసాయి



ఆలయ ధ్వజస్తంభం వద్ద సినీ హీరో కృష్ణసాయి

శ్రీకాళహస్తి, మే 14: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం సుందరాంగుడు సినీ కథా నాయకుడు కృష్ణసాయి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

తిమ్మసముద్రంలో ఇరువర్గాల ఘర్షణ

పోలీసులకు ఫిర్యాదు

కేవీబీపురం, మే 14: మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో సోమవారం పోలింగ్ సందర్భంగా దొంగ ఓట్ల విషయమై టీడీపీ, వైసీపీ వర్గాలు ఘర్షణ పడ్డారు. ఎస్ఐ షేక్ షరీఫ్ ఇరువర్గాలను సర్దుబాటు చేశారు. మళ్లీ సోమవారం రాత్రి ఇరువర్గాలు గొడవపడ్డారు. పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా రాజులకండ్రిగలో ఎస్టీలు, అగ్రవర్ణాల వారి మధ్య స్వల్ప వివాదం తలెత్తి ఘర్షణ పడ్డారు. మంగళవారం ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వడదెబ్బతో వృద్ధుడి మృతి

నాగలాపురం, మే 14: నాగలాపురం మండలం కడివేడు గ్రామానికి చెందిన చెంచురామయ్య(70) వడదెబ్బతో మృతి చెందాడు. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు.. గ్రామానికి వెళ్లే బండిబాట వద్ద సోమవారం సాయంత్రం చెంచురామయ్య మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఓబయ్య సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. చెంచు రామయ్య ఆదివారం నుంచి కనిపించంలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన చెంచురామయ్య

సుబ్బయ్యకండ్రిగలో వైసీపీ వర్గీయుల అరాచకం

టీడీపీ నేతలపై దాడి, బాధితులకు సుధీర్‌రెడ్డి పరామర్శ

రేణిగుంట, మే 14: రేణిగుంట మండలం ఆర్.మల్లవరం పంచాయతీ పరిధిలోని సుబ్బయ్యకండ్రిగలో టీడీపీ నాయకులపై వైసీపీ వర్గీయులు సోమవారం రాత్రి దాడి చేశారు. స్థానికుల కథనం మేరకు... సుబ్బయ్యకండ్రిగలోని పోలింగ్ బూత్‌లో టీడీపీ తరపున ఏజెంట్‌గా ఉన్న గుండ్రాల రెడ్డి ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉండగా స్థానిక సర్పంచు బాబ్జిరెడ్డి, అతని అనుచరులకు వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో గుండ్రాల రెడ్డిపై వైసీపీ వర్గీయులు దాడి చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత చిన్నారెడ్డి సంఘటనాస్థలానికి చేరుకుని దాడిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సంర్భంగా చిన్నారెడ్డి తలకు రక్త గాయాలయ్యాయి. వైసీపీ మండల నాయకులు సుబ్బయ్యకండ్రిగకు చేరుకోవడంతో గ్రామంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గ్రామస్తులు వైసీపీ నాయకులను చుట్టుముట్టారు. అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వైసీపీ నాయకులను అక్కడి నుంచి పంపించేశారు.

వైసీపీ దాడిని ఖండించిన సుధీర్‌రెడ్డి

సుబ్బయ్యగుంటలో టీడీపీ నాయకులపై వైసీపీ నేతలు దాడి చేయడాన్ని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గాయపడిన టీడీపీ నాయకుడు చిన్నారెడ్డిని ఆయన స్వగృహంలో సుధీర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి రిషితారెడ్డి మంగళవారం పరామర్శించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులపై దాడి చేసిన వైసీపీ నేతలు ఎలా బయటకు తిరుగుతారో చూస్తానని హెచ్చరించారు. టీడీపీ నాయకులపై జరిగిన



చిన్నారెడ్డిని పరామర్శిస్తున్న సుధీర్‌రెడ్డి దంపతులు

దాడులన్నీ తనకు గుర్తున్నాయని, ఖచ్చితంగా వైసీపీ నాయకులకు తగిన రీతిలో సమాధానం చెప్తామన్నారు. వీఎంపల్లిలో సోమవారం తనపై కూడా దాడికి యత్నించారని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే నియోజకవర్గంలో రౌడీయిజం లేకుండా చేస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునస్వామి నాయుడు, జ్యోతినారాయణ, ఎంజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

శ్రీకాళహస్తి, మే 14: శ్రీకాళహస్తి పట్టణంలోని జయరామరావువీధిలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. రాములవారి మందిరం కూడలిలో రెండేళ్ల నుంచి మ్యాన్‌హోల్‌కు మూత లేకపోవడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ కూడలిలో నిత్యం వాహనదారులు, పాదాచారులు పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. మ్యాన్‌హోల్‌పై మూతలేకపోవడంతో అధికారులు బారికేడ్‌ను అడ్డంగా పెట్టి కాలం వెలదీస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మ్యాన్‌హోల్‌కు బారికేడ్‌ను అడ్డంగా పెట్టిన దృశ్యం

పులివర్తి నానీపై దాడి గర్హనీయం

శ్రీకాళహస్తి, మే 14: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీపై వైసీపీ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం స్ట్రాంగ్‌రూముల వద్ద వైసీపీ గుండాలు నానీనిపై దాడి సరి కాదన్నారు. ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. నానీపై దాడి చేయాలనే దురద్దేశంతోనే కారులో బీరుబాటిళ్లు, గొడ్డళ్లు, కత్తులు, కర్రలతో లోపలకు ప్రవేశించారని తెలిపారు. పోలీసులు ఎలాంటి తనిఖీలు లేకుండా వాహనాన్ని పంపించడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. ఇందులో పోలీసుల వైఫల్యం కనిపిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలకు చోటు లేదని, దాడికి కారణమైన వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఏకలవ్య గురుకులంలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ, మే 14: మండలంలోని కనమనంబేడు గ్రామంలో ఉన్న ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి సూర్యనారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూపులకు ప్రవేశాలు జరుగుతున్నట్లు తెలిపారు. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. అర్హులైన గిరిజన బాలబాలికలు [illegible] వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9440204745 నెంబరును సంప్రదించాలని సూచించారు.

18 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి, మే 14: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈ నెల 18నుంచి 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. 18న అంకురార్పణ, విష్వక్సేనుల ఉత్సవం, 19న ధ్వజారోహణం, 23తేదీ రాత్రి గరుడసేవ, 24న కల్యాణోత్సవం, గజవాహనం, 25న వసంతోత్సవం, రాత్రి రథోత్సవం, 26నరాత్రి పల్లకీసేవ, 27న ఉదయం పార్వేట ఉత్సవం, రాత్రి ధ్వజావరోహణం, 28న శాంతి అభిషేకం, రాత్రి ఏకాంత సేవతో ఉత్సవాలు ముగియనున్నట్లు పేర్కొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, మే 14: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..!

సత్యవేడు, మే 14: ఎన్నికల ప్రక్రియలో కీలకమైన పోలింగ్ ఘట్టం సోమవారం ముగిసింది. కౌంటింగ్ ప్రక్రియకు ఇంకా మూడు వారాలు గడువుండగా బరిలో ఉన్న అభ్యర్థులకు గెలుపోటములపై చెమటలు పడుతున్నాయి. రాష్ట్ర సరిహద్దు నియోజకవర్గమైన సత్యవేడులో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. మంగళవారం పోలింగ్ వివరాలు అధికారికంగా అందడంతో వాటిని ముందేసుకుని లెక్కలు కడుతున్నారు. పోలింగ్ సరళిపై పార్టీ నేతలు ముఖ్యనేలతో ఆరా తీస్తున్నారు. నియోజకవర్గంలో తమకు ఎక్కడ ఎక్కువ ఓట్లు పడ్డాయి. ఎక్కడ తక్కువ పడ్డాయి అనే వివరాలను విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం తెప్పించుకుంటున్నారు. దీని ఆధారంగా తమ గెలుపు అవకాశాలు ఎలా ఉన్నాయనే విషయంలో అంచనాలు వేస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ సర్వేలు టీడీపీకి అనుకూలంగానే ఉన్నాయని, గెలుపు ఖాయమనే ధీమాతో టీడీపీ నేతలు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. నియోజకవర్గంలో పోలింగ్ సరళి సైతం అలాగే ఉందని రాజకీయ విశ్లేషకులు కూడా భావిస్తున్నారు. దీంతో టీడీపీలో జోష్ కనబడుతోంది. కాగా క్రాస్ ఓటింగ్‌పై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రధానం నియోజకవర్గంలో అధికార పార్టీ ఓట్లు భారీగా చీలినట్లు తెలుస్తోంది. టీడీపీ తరఫున ఎమ్మెల్యే ఆదిమూలం, వైసీపీ తరఫున రాజేష్ బరిలో ఉన్న విషయం తెలిసిందే. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి ఆదిమూలంపై మళ్లుతోందని, దీంతో ఓట్లన్నీ గంప గుత్తగా తమకే పడతాయని వైసీపీ భావించింది. కానీ ఎంపీ ఓటింగ్ విషయంలో జరిగిన క్రాస్ ఓటింగ్ టీడీపీ అభ్యర్థికి లాభం చేకూర్చేలా ఉందన్న చర్చ జరుగుతోంది.

85శాతం పోలింగ్ నమోదు

నియోజకవర్గంలో 85 శాతం ఓటింగ్ నమోదైంది. ప్రజలు వెల్లువలా తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,15,385 మంది ఓటర్లుండగా 1,83,686 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నారాయణవనం మండలంలో అత్యధికంగా 90 శాతం ఓటు నమోదు కాగా, నాగలాపురంలో అత్యల్పంగా 82 శాతం నమోదైంది. అదే విధంగా నారాయణవనం మండలం ఎరికంబట్టు హరిజనవాడ 129 నెంబరు పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 96.23 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా వరదయ్యపాళెంలోని 64 నెంబరు పోలింగ్ బూత్‌లో 61.45 శాతం పోలింగ్ నమోదైంది. కాగా, 50 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతంపైబడి పోలింగ్ నమోదు కాగా 189 బూత్‌లలో 80 శాతం పైబడి పోలింగ్ నమోదయింది.

మండలాల వారీగా పోలింగ్ ఇలా...

బుచ్చినాయుడు కండ్రిగలో 27,055 ఓట్లకు గాను 22,593 ఓట్లు పోలయ్యాయి. 83శాతం పోలింగ్ నమోదైంది. వరదయ్యపాళెం మండలంలో 36,241 ఓట్లకు 30,751 ఓట్లు పోల్ కాగా 84 శాతం నమోదయింది. కేవీబీపురంలో 33,570 ఓట్లకు 29,178 పోల్ కాగా, 86 శాతం నమోదైంది. నారాయణవనం మండలంలో 28,162 ఓట్లకు 25,383 పోల్‌కాగా 90 శాతం నమోదైంది. పిచ్చాటూరు మండలంలో 25,033 ఓట్లకు 21,083 పోల్‌కాగా 84 శాతం నమోదైంది. నాగలాపురంలో 26,874 ఓట్లకు 22,269 పోల్‌కాగా 82 వాతం నమోదైంది. సత్యవేడు మండలంలో 38,450 ఓట్లకు 32,429 ఓట్లు పోల్‌కాగా 84 శాంతం పోలింగ్ నమోదైంది.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, మే 14: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

గురవారెడ్డికి సన్మానం

ఏర్పేడు, మే 14: ఏర్పేడు మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రెడ్డివారి గురవారెడ్డిని ఆ పార్టీ నాయకులు సన్మానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న గురవారెడ్డి ఇటీవల రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. మంగళవారం బండారుపల్లెలోని గురవారెడ్డి స్వగృహంలో ఆయనను టీడీపీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, ఊటి చంద్రశేఖర్ యాదవ్, రాచేటి సుబ్రహ్మణ్యం, అశ్వర్థ, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కాలభైరవ స్వామి ప్రాకార ఉత్సవం



కాలభైరవ స్వామికి హారతులు సమర్పిస్తున్న ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్

శ్రీకాళహస్తి, మే 14: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళతాళాల మధ్య అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో శ్రీసిటీ విద్యాసంస్థల విజయకేతనం

వరదయ్యపాళెం, మే 14: సోమవారం వెలువడిన సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో శ్రీసిటీలోని చిన్మయ, ఆకార్డు విద్యాసంస్థలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. చిన్మయ విద్యాలయం నుంచి 46మంది పరీక్షలు రాయగా 14మంది డిస్టంక్షన్ సాధించారు. సరూప్య ప్రవాహ 90.2శాతం, రష్మీగౌడ్ 87.4శాతం, ఆదిత్య ఝా 86.2శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారు. అదేవిధంగా 12వ తరగతి పరీక్షల్లో కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులను శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.

వైసీపీ నేతల అత్యుత్సాహం

వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగింపు

రేణిగుంట, మే 14: రేణిగుంట పట్టణంలో కొంతమంది వైసీపీ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారు. సోమవారం రాత్రి ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే ఫ్లైఓవర్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించారు. మంగళవారం ఉదయం టీడీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేశారు.

పుత్తూరు వార్తలు

అందరి సహకారం మరువలేనిది

పుత్తూరు అర్బన్, మే 14: గత ఐదేళ్లుగా కష్టాలు, కన్నీళ్లు దిగమింగుకుని ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేసిన టీడీపీ కార్యకర్తలు, నాయకుల సహకారం మరువలేనిదని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సోమవారం ఎండ తీవ్రతను, ఇబ్బందులను ఎదరించి భారీగా పోలింగ్‌లో పాల్గొని ఓటు ద్వారా తనను ఆశీర్వదించి, గుండెల్లో పెట్టుకున్న నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు. ప్రధానంగా మహిళలు, వృద్ధులు, యువత, విద్యార్థులు, రైతులు, కార్మికులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని వివరించారు. ఎన్నికల సంగ్రామంలో చేయిచేయి కలిపి నడిచిన జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల కృషిని జీవితాంతం గుర్తించుకుంటానని చెప్పారు. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటానని, మీ కుటుంబంలో ఒకడిగా ఉంటూ సేవలు అందిస్తానని పేర్కొన్నారు.

తిరుమలేశుడి సేవలో ఐపీఎల్ క్రికెటర్లు

తిరుమల, మే 14 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ బెంగళూరు టీమ్ క్రికెటర్లు అనూజ్ రేవంత్, కరణ్ శర్మ, స్వప్నిల్ సింగ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వారు ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపలకు వచ్చిన క్రికెటర్లను చూసేందుకు క్రికెట్ అభిమానులు ఉత్సాహం చూపారు.

మధ్యవర్తిత్వ చట్టంపై అవగాహన

పుత్తూరు అర్బన్, మే 14: న్యాయస్థానాల్లో దాఖలు చేసే వ్యాజ్యాల కన్నా మధ్యవర్తిత్వ చట్టం ద్వారా కక్షిదారులకు మరింత సంతృప్తికరంగా న్యాయం అందుతుందని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక కోర్టు హాలులో మధ్యవర్తిత్వ చట్టంపై న్యాయవాదులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వ చట్టం ద్వారా పరిష్కారమయ్యే కేసులకు కోర్టు ఫీజు తిరిగి వాపస్ చేయబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కక్షిదారుల కేసులను పరిష్కరించేందుకు న్యాయవాదులు సమకరించాలని కోరారు. అలాగే జూన్ 29వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేందుకు న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జానకి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర



రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను తెలుసుకుంటున్న జేడీ

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించండి

పుత్తూరు అర్బన్, మే 14: రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్య విధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సరళమ్మ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని ఆమె సందర్శించారు. వివిధ వార్డుల్లో పర్యటించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మరింతగా సేవలు అందించేందుకు డాక్టర్లు, నర్సులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణకాంత్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.16 కోట్లు

తిరుమల, మే 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.16 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 70,815 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

నేడు గోవిందరాజుల ఆలయంలో అంకురార్పణ

తిరుపతి(కల్చరల్), మే 14: గోవిందరాజ స్వామి ఆలయంలో గురువారం నుంచి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయంలో బుధవారం అంకురార్పణ జరుగుతుంది. ఇందులో భాగంగా సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.